గోతెలుగు.కామ్
చక్కటి కుటుంబ వార పత్రిక

# జనవరి 2014
# కథలు




ప్రసాద్ చెల్లెలి పెళ్ళిచూపులు జరుగుతున్నాయి.

అప్పుడే వచ్చిన ప్రసాద్ తో వాళ్ళ నాన్న "చెల్లెలి పెళ్ళిచూపులని తెలుసుగా... ఇప్పుడా రావడం?" అన్నాడు.

"ఎప్పుడొచ్చామన్నది కాదు ప్రశ్న అసలొచ్చామా లేదా అన్నది ముఖ్యం" అంటూ కూర్చున్నాడు.

"ఈ అబ్బాయీ..." అడిగారు అక్కడున్నవాళ్ళు.

"ఎవరి పేరు చెబితే చెల్లెల్లందరూ రాఖీకట్టిన అన్నయ్యగా భావిస్తారో వాడే ప్రసాద్, అంటే నేను... ఈ చెల్లెకి రక్తం పంచుకు పుట్టిన

అన్నయ్యని"

"అమ్మాయికి... వంట చేయడం... పాటలు పాడడం వచ్చా" పెళ్ళికొడుకు తల్లి ప్రశ్నించింది.

"అవే కాదు... మీక్కావలసిన వాటికన్నా ఒకటెక్కువగానే వచ్చు నా బంగారు చెల్లెకి... మీకేవన్నా అభ్యంతరమా?" సూటిగా చూస్తూ అన్నాడు ప్రసాద్.

వాళ్ళు ఒకళ్ళ ముఖాలు ఒకళ్ళు చూసుకున్నారు.

"అమ్మాయి లక్షణంగా వుంది. మీ సంప్రదాయమూ నచ్చింది. ఇహ తాత్సారం చేయకుండా కట్నాలు కానుకలు గురించి మాట్లాడుకుంటే..." అబ్బాయి తండ్రి అన్నాడు.

"కట్నాలు కానుకలా?... మేమిచ్చే పొజిషన్లో వున్నా ఇవ్వం. ఎందుకంటే రేపు మీరు చచ్చి నరకానికి వెళితే గరుడపురాణం ప్రకారం కనుకాట్నక శిక్ష వేస్తారు. అంటే బంగారం... డబ్బుల్లో... గుండు సూదులూ... దబ్బనాలు పెట్టి వాటితో హింసిస్తారు. మంచితనంతో మా చెల్లెని ఇంటికోడలిగా చేసుకుంటే ఆడియో ఫంక్షనంత గ్రాండుగా పెళ్ళి జరిపిస్తాం. ప్రతి పండక్కీ సినిమా విజయోత్సవాలంత వేడుకలు జరిపిస్తాం. కాని రేపు పెళ్ళయ్యాక మా చెల్లెని వేదిస్తే అమ్మతోడు నేను అందర్నీ అడ్డంగా నరికేస్తా" అన్నాడు క్రోధంగా...

దానికి వచ్చినవాళ్ళందరూ భయంతో బిక్కచచ్చిపోయి "సరేనండి మేము వెళ్ళొస్తాం... త్వరలో ఏ విషయం ఉత్తరం రాస్తాం" అంటూ పారిపోయారు.

"ఈ పెళ్ళిచూపులకన్నా నువ్వు రాకూడదని వెయ్యి దేముళ్ళకి మొక్కుకున్నాను... నా మొర ఎవరూ వినలేదు. నువ్వు తగలడ్డావు. ఈ పెళ్ళిచూపుల తతంగాన్ని తగలెట్టావు" క్రోధంగా కొడుకువంక చూస్తూ అన్నాడు పరంధామయ్య.

"విన్నావా చెల్లెమ్మా నాన్న మాటలు! నా చెల్లెలి సుఖం తప్ప నాకేది ముఖ్యం కాదని నువ్వైనా మనసులో అనుకుంటే చాలు" అన్నాడు కళ్ళనీళ్లతో.

"ఏడిశావు. నీ మూలంగా నా ఆశలు ఆవిరై కోరికలు ఉడిగిపోతున్నాయి. నాన్న బ్రతికుండగా నా పెళ్ళిచేయనివ్వవు... అలాగని ఫ్యూచర్లో నువ్వూ చేయలేవు... ఛ... వెధవ బ్రతుకు నాది" అని విసుగ్గా లోపలికి వెళ్ళిపోయింది.

"నీ మాటలతో ఈ అన్న గుండెకి గాయం చేశావమ్మా... గాయం చేశావు" అని సోఫాలో కుప్పకూలిపోయాడు.

***

"ఒరేయ్. నా రిటైర్మెంట్ కి ఇంకా మూడేళ్ళే వుంది. ఆ లోపల నువ్వు జీవితంలో సెటిలవ్వాలి. దయచేసి ఈసారన్నా ఇంటర్వ్యూలో చక్కగా సమాధానాలు చెప్పి ఉద్యోగం సంపాదించరా" వేడికోలుగా అడిగాడు పరంధామయ్య.

"ఈ ఇంటికీ... నీకూ ఆధారంగా వుండాలని నాకు మాత్రం అనిపించదా నాన్నా... కానీ విధికి అందరూ తలవంచాల్సిందే... ఏది రాసిపెట్టి వుంటే అది జరుగుతుంది... హుః" అని చెప్పి సర్టిఫికెట్ల ఫైల్ తీసుకుని వేగంగా బయటకెళ్ళిపోయాడు.

***

"ప్రపంచంలో ఎత్తైన శిఖరం ఏది"

"అవినీతి"

ఇంటర్వ్యూ చేస్తున్న వాళ్ళు ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

"ఈ ఉద్యోగం మీకు ఎంత అవసరమో చెప్పగలరా?"

"అంటే నా అవసరం మీకు లేదా?... మీరు ఛారిటీ సంస్థ స్థాపించి ఉద్యోగార్థుల అవసరాల కనుగుణంగా ఉద్యోగాలిచ్చి... జీతాలిస్తారా? అడుగడుగునా కుంభకోణాలు... ఆశ్రితపక్షపాతాలు... అవినీతిపర్వాలు... హుఁ." ఉద్రేకంతో ఊగిపోయాడు.

"మీకు షార్ట్ టెంపరనుకుంటా..?"

"ఏం మీకు వుండదా! మీరూ నా స్థాయి నుండే ఈ స్థాయికొచ్చారు కదా మర్చిపోయారా ఆ సంగతి? ఆ సీట్లో కూర్చోంగానే 'గతం గతః' అనుకోవడమేనా?... ఇహనుండైనా పనికొచ్చే ప్రశ్నలేసి, పనిచేసే వాళ్ళని తీసుకోండి. మీ సంస్థ, దేశం రెండూ బాగుపడతాయి. అంతేగాని లంచాలకోసం వేకెన్సీల నమ్ముకుని అభ్యర్థుల జీవితాలని అంధకారం చేయొద్దు... ప్లీజ్" అని విసురుగా బయటకొచ్చేశాడు.

వాళ్ళకి క్షణం పాటు ఏమీ అర్థం కాలేదు. బుర్ర హీటెక్కడంతో, ఇంటర్వ్యూలు మరుసటిరోజుకి వాయిదావేసి వెళ్ళిపోయారు.

***

"ఏరా ఉద్యోగం వచ్చిందా?" ఆశగా అడిగింది పార్వతమ్మ కొడుకుని.

"ఆ ముఖం చూస్తే తెలియడంలా ఏం వెలగబెట్టాడో" వ్యంగంగా అన్నాడు పరంధామయ్య.

"నిన్ను నీ బాధని అర్థంచేసుకోలేని వాడు కాదు నాన్నా నీ కొడుకు. ప్రతి కుక్కకీ మొరిగే రోజు ఒకటి వస్తుంది. నీ కొడుక్కీ వస్తుంది. అప్పటిదాకా కూల్ గా వుండాలి కూల్ గా..." అని తన గదిలోకి వెళ్ళిపోయాడు.

***

"పార్వతీ! నేనేం పాపంచేశానని నాకు ఇలాంటి కొడుకుని ప్రసాదించాడు ఆ పరమేశ్వరుడు. నిష్ఠా గరిష్ఠుడిగా నిత్యకర్మలు చేశానే! అగ్నిహోత్రంతో... చేసిన పాపాలు పటాపంచలు చేసుకున్నానే అటువంటి నాకు..." బాధతో ఆయన గొంతు పూడుకుపోయింది.

"ఏవండీ మరే! వాడు అలాపుట్టడానికి కారణం మీరు కాదండీ, నేను. పాపిష్టిదాన్ని. నేను గర్భవతిగా వున్నప్పుడు రాజమండ్రి లో మా పుట్టింట్లో వుండేదాన్నికదా! అప్పుడు మాఇంటి పక్కనే ఒక సినిమా టాకీస్ వుండేది. దాని యజమాని కుటుంబం మాకు తెలిసిన వాళ్ళే. దానితో నేను కాలక్షేపానికి ప్రతిరోజూ దాదాపు ప్రతి షోకీ సినిమాకెళ్ళేదాన్ని. ఫ్రీగా వస్తోందని సినిమా చూశానుగాని అది మన జీవితాల మీద ఇంతగా ప్రభావం చూపుతుందనుకోలేదు."అంది.

అప్పుడే అటుగా వచ్చిన ప్రసాద్ "అమ్మా! ఎంతపనిచేశావమ్మా! నీ ఆనందంకోసం నువ్వు సినిమా హాల్లో కూర్చుంటే దాని ఫలితం నా మీద పడింది. నేను నిజ జీవితంలో నటుడ్ని అయిపోయాను. నాన్నతో సహా సమాజం నన్ను అపహాస్యం చేస్తోంది. వేడుక చూస్తోంది. ఇదేనా మీరు తల్లిదండ్రులుగా నాకు చేసింది. నన్ను కనకపోయినా బావుండేదమ్మా! బావుండేది." అని తల్లి కాళ్ళమీద పడిపోయాడు.

పరంధామయ్యకి అంతా అయోమయంగా వుంది. గర్భవతిగా కొన్ని సినిమాలు చూసిన తన భార్యవల్ల తనకింతటి ఉపద్రవం ఎదురైతే... తన చుట్టాలు... తనకి తెలిసిన వాళ్ళు అహర్నిశలూ ఛానల్ టీవీలకి అతుక్కుపోయి మనోహింసాత్మక సీరియల్స్ కి బానిసలైపోతున్నారు. ఆ ప్రభావం వాళ్ళమానసిక స్థితిమీద, గర్భవతుల పిండాలమీద ఎటువంటి ప్రభావం చూపుతుందో... ముందు ముందు సమాజం ఎలా వికృతత్వాన్ని సంతరించుకుంటుందో ఊహించుకుంటుంటే ఒళ్ళు జలదరించింది. ఆయన చాలాసేపటి వరకూ అవాక్కయిపోయి అలా స్థాణువులా వుండిపోయాడు.

***




చెప్పొద్దూ మాపరశురాముడు మహామొండి మనిషైనా డాక్టర్ల మాటంటే వేద వాఃక్కే! వాక్కు... అనకుండా వాఃక్కని ఎందుకన్నానంటే వాడి ఘట్టి నమ్మకాన్ని అంత గట్టిగా వత్తి వత్తి పలికి నట్లుంటుందనీ, అది మీకు అర్ధంమైనట్లుంటుందనీ నీ నీ. వేదాన్ని ఔపోసాన పట్టిన వేదపండితులు సైతం చెప్పినా నమ్మని విషయాలను డాక్టర్ అదీనీ, ఆచారిగారు చెప్తే ఇట్టే నమ్మేస్తాడు మా పరశురాముడు. ఇదే వేదంలో ఉండి ఉంటుందని వాడి నమ్మిక వాడికి చిన్నప్పట్నుంచి అదో పిచ్చి 'వైద్య నమ్మకం' . అది ఎలా ఏర్పడిందంటే...

మేం మూడో క్లాస్లో చదివేప్పుడనుకుంటా అంత బాగా గుర్తు లేదు కానీ, ఓమారు మా పరశురామునికి తీట పట్టింది. బళ్ళో అందరూ దూరంగా కూర్చునేవారు, తమకూ ఆతీట పట్టుకుంటుందనే భయంతో. వాడు పక్క నుంచి వెళుతుంటే ముక్కు మూసుకునేవారు

చీము వాసనకు! స్కూలు పంతులు పాపయ్య సైతం వాడి పలకని దూరంగా బల్ల మీద పెట్టి మరీ చూసేవారు.

ఎన్నో మార్లు "ఒరే! పరశురామా! కుంకుడు పిసరు తో వొళ్ళు బాగా రుద్దుకుని రోజుకు రెండు మార్లు స్నానం చేయరా! లేకపోతే శీకాయ పొడైనా సరే రా! వేప ఆకులు నూరి ఆ పచ్చడి వంటికి పట్టించి ఆరాక స్నానం చేయరా! ఇలా స్కూల్ కు వస్తే మా కందరికీ బాధేరా! నీవలా గోళ్ళతో గోక్కుంటుంటే రక్తం చీము కారి వాసనేస్తుంటే చూడటమే కష్టంగా ఉందిరా!" అని పాపం పంతులు పాపయ్యగారు రోజుకు పది మార్లయినా చెప్తూనే ఉండేవారు.

ఓరోజున ఆయన వాడికి ఓ అర్ధ శేరు కుంకుడు కాయలూ, శీకాయ పొడీ కొని తెచ్చిచ్చారు. ఐనా వాడు అది రుద్ది స్నానం చేస్తే ఒట్టు. పంతులుగారు వాళ్ళ అమ్మనూ నాన్నగారిని పిల్చిమరీ చెప్పారు "ఏం చేయమంటారు చెప్పండి పంతులు గారూ! వాడేం చిన్నవాడా! పదేళ్ళు వంటి మీది కొచ్చాయి. (ఏమాట కామాటే చెప్పుకోవాలి మరి... కాస్త ఆలస్యంగా బళ్ళో చేరి కాస్త కాస్త చదువుతూ క్రింది వారికి బాడీగార్డ్ గా ఉండి స్నేహం కట్టాల నేసత్ సంకల్పంతో, నిదానమే ప్రధానమని మెల్లిగా చదూకోడం వల్ల పదేళ్ళకు మూడో తరగతిలో ఉండి మమల్నందరినీ జాగ్రత్తగా చూసుకుంటూ పెద్దన్నలా ఉండేవాడు). వారానికోమారు స్నానం చేస్తే తీట, గజ్జి వస్తాయని ఎన్నిమార్లు చెప్పినా వినడే! ఏంకావాల్సి ఉంటే అదే అవనీండి పంతులుగారూ! మావల్లకాదు వాడిని మార్చటం." అని చెప్పి వెళ్ళారు.

ఓ శుభ ముహూర్తాన పంతులు గారు బళ్ళో మెడికల్ క్యాంప్ పెట్టించి పిల్లలందరినీ, డాక్టర్ గారి చేత పరీక్షలు చేయించారు. అప్పుడు చర్మవ్యాధి నిపుణుడైన ఆయుర్వేద వైద్యులు ఆచారిగారు వాడిని పిలిచి "నాయనా! పరశురామా! నీపేరు చాలా గొప్పది. నీవూ దానికి తగినట్లు ఉండాలోయ్! నీకు ప్రత్యేకంగా వైద్యమేమీ అవసరం లేదు. నేనిచ్చే మందు రోజా వంటికి పట్టించి, ఆరాక రోజా రెండు పూటలా ఈ మందుపొడి తో రుద్ది స్నానం చెయ్యి , రాత్రులు వంటికి ఈ నూనె పట్టించు ఈ మందు కాయలు రోజా రెండు పూటలా మింగు, అంతే ఒక్క పదిరోజుల్లో నీ ఒంటి మీద ఒక్క పుండు ఉంటే చెప్పు, నేను వైద్యం చేయటం మానుకుంటా ఛాలెంజ్" అని చెప్పాడు.

అంతే ఆరోజు నుండీ వైద్యం మొదలెట్టుకుని ఒడి పంతులు గారు చెప్పిందే ఐనా వైద్యుల వారు చెప్పిన వేప గుండ రాచుకుని, ఒక పూట కుంకుడు పొడితోనూ మరోపూట శీకాయ పొడితోనూ రుద్ది రుద్ది స్నానం చేసి, రాత్రులు ఒంటికి వేప నూనె ఒక వారం, నువ్వులనూనె ఒక వారం రాచు కుంటూ, వైద్యులిచ్చిన వేపమాత్రలు మింగుతూ ఉండే సరికి తీట గజ్జి ఎటుపోయాయో తెలిదుకాని చక్కని నిగ నిగలాడే చర్మం వచ్చింది. నిమ్మపండు ఛాయతో మెరిసి పోయాడు పరశురాముడు. వాడి పక్కన కూర్చొను పోటీ పెరిగిపోయింది తరగతిలో. వంతుల ప్రకారం రోజు కొక్కరు కూర్చునేవారు. అలా వాడి ప్రతిష్ట పెరిగి, చదువుపై శ్రద్ధ పెరిగి క్లాస్ లో మొదటి వాడుగా పొడుగు, బలంతో పాటు చదువులోనూ మొదటి స్థానం సంపాదించాడు మాపరశురాముడు. వాడికి నాకూ మంచి దోస్త్ పెరిగింది. ఎస్సెల్సీ వరకూ మేం ఇరువురం ఒకే బెంచ్ ఒకే స్కూల్. అలా మా మైత్రి బలపడింది.

ఎస్సెల్సీ పరీక్షలు పదిరోజు లుండగా మా పరశురాములుకు తలనొప్పి విపరీతంగా వచ్చింది. తల ఎత్తి చూడలేకపోయాడు. వాళ్ళ బామ్మ "ఒరే నాయనా! చదివి చదివి వేడెక్కింది. తలకు ఆముదం అంటుకుని తలారా స్నానం చేయి, తల నొప్పి ఇట్టే పోతుంది" అని చెప్పగా ఆమె పై తాటి చెట్టంత ఎగిరాడు, వాడసలే ఆరడుగుల పొడుగు. వాడికి ఝడిసి ఎవ్వరూ ఏమీ చెప్పలేక మౌనం వహించగా, ఇద్దరం కలసి చదువుతున్నాం గనుక నేనే వాడిని ఆయుర్వేద వైద్యులు ఆచారి గారి వద్దకు తీసుకెళ్ళా ను. ఆయన అంతా విని ఒక సీసా యిచ్చి అది బాగా తలకు పట్టించి ఒక గంట నానాక తలారా స్నానం చేయమన్నాడు మూడు రోజులపాటు. ఆయన వైద్య రుసుంతో పాటుగా, తైలం సీసా సొమ్ము చెల్లించి, నాన్న చేతి తైలం వదిల్చి, వచ్చాక వైద్యుల వారు చెప్పినట్లు ఒక్కరోజు చేయగానే తలనొప్పి మటు మాయ మైంది. దాంతో మావాడికి వైద్య ఆచారిగారిపట్ల నమ్మకం పెరిగిపోయింది.

మేం ఇంటర్లో చేరే రోజున వాడికి తీవ్రమైన కడుపునొప్పి వచ్చింది. వాళ్ళ అవ్వ "ఎంతిష్టమైనా కొత్త బియ్యంతో చేసిన అతి రసాలు అదే పనిగా తింటే కడుపునొప్పిరాకే మవుతుంది? చెప్తే వింటేనా?" అని చివాట్లు పెట్టింది. శొంఠి గుండ తేనెలో కలిపి బాదం ఆకులో వేసి తినమని ఇస్తే విసిరవతల పారేశాడు. చారుకాచి ఇస్తే 'నీవేతాగు నాకు వద్దని' పారబోశాడు.

“ఎవ్వరి మాటా వినడు వీడు" అని తల పట్టుక్కూర్చున్నారంతా. ఈమారూ వాడిని నేనే దగ్గిరుండి మళ్ళీ ఆయుర్వేద వైద్యులు ఆచారిగారి వద్దకు తీసుకెళ్ళాను.

"బాబూ! ఉదయం ఇడ్లీ, రాత్రిపూట ఈ పొడికలుపుకుని ఓగ్లాసెడు మజ్జిగ త్రాగు. కడుపునొప్పి తగ్గేవరకూ ఈ పొడి రోజుకొక పొట్లం చొప్పున మొదటి ముద్దలో వేసుకుని తిను." అంటూ శొంఠిపొడి పది పొట్లాలు కట్టించి ఇచ్చాడు. ఈమారూ పాపం మా పరశురాముని తండ్రి గారి జేబు తైలం వదిల్చాక వైద్యులిచ్చిన ఆమందుపొట్లాలు తినగానే వాడి కడుపునొప్పి ఒక్క రోజులో మటుమాయ మైంది. ఆదెబ్బలతో ఆచారి వైద్యుల మీద నమ్మకం మరీ ఎక్కువైంది పరశురామునికి.

వాడి అమాయకత్వానికి నాకు జాలేసినా, ఇంట్లోవారి మాట పెడచెవిన పెడుతూవాడి తండ్రిగారి జేబు తైలం ఇలా వదుల్చుతున్నందుకు వాడిపై నాకు కొంత ఆగ్రహం వచ్చిన మాట మాత్రం యదార్థం. మెల్లిగా మాపరశురాముని ఆరోగ్యం కుదుటబడి మేమిద్దరం ఇంటర్లో చేరాం. వాళ్ళబామ్మ మాతో పాటు పట్నంలో ఉంటూ మాఇద్దరికీ వండి పెడుతుండగా మేం హాయిగా తింటూ శ్రద్ధగా చదువుకుంటూ ఇంటర్ పాస్ చేశాం. నేను ఇంజనీరింగ్ లో చేరగా, మాపరశురాం మాత్రం డిగ్రీలో చేరాడు, దాంతో మాఇద్దరి సాన్నిహిత్యమూ కొంత శారీరకంగా దూరమైనా శలవుల్లో కలిసినపుడు మాత్రం చిన్నప్పటి విషయాలు చెప్పుకుంటూ హాయిగా గడిపేసే వాళ్ళం.

నేను ఇంజనీరింగ్ పూర్తి చేసి ఉద్యోగరీత్యా అనేక ప్రాంతాలు తిరుగుతూ, వివాహమై భార్య పిల్లల బాధ్యతలు సంసార జంజాటకపు సందడిలో మా పరశురాముని కలవడం కుదరలేదు. జీవన పోరాటపు ఒరవడిలో పడి బాల్య మిత్రుని జ్ఞాపకాలు కొంత దూరం

చేసుకున్నమాటమాత్రం యదార్ధం. పిల్లల చదువులూ, పెళ్ళిళ్ళూ, ఉద్యోగ బాధ్యతలూ పూర్తై విశ్రాంత జీవనంలోకి వచ్చాక, తిరిగి బాల్య బంధాలూ, స్నేహాలూ, మనస్సు పొరల్లోంచి బయటకు రాగా మా పరశురాముని చూడాలనిపించి బయల్దేరాను.

దారిపొడవునా మా ప్రాధమిక పాఠశాల రోజులు తలంచుకుంటూ వాడి ఇల్లు చేరాను. మీకు చెప్పనే లేదుగా మాపరశురాముడు డిగ్రీ పూర్తి చేసి బి.ఎడ్.చేసి మా స్వంత ఊర్లోనే పంతులుగా చేరాడు.

పెళ్ళై వాడికి ఓకుమార్తె, కుమారుడూనూ, వాడూ బాగా చదివి అమెరికా వెళ్ళిపోయాడుట. కూతురు మాత్రం బెంగుళూర్లో భర్తతో ఉంటున్నదిట.

నన్ను చూడగానే మాపరశురాముడు పడిన ఆనందం ఇంతా అంతా కాదు. వాడు గట్టిగా నన్ను హత్తుకుని కన్నీరు కార్చాడు. "ఏంటిరా! ఇదంతా! పిచ్చా?" అన్నాను.

"ఏమైనా అనుకోరా! విశ్శూ! నిన్ను చూస్తే నాకు మన ప్రాధమిక పాఠశాల రోజులు గుర్తువస్తున్నాయిరా!" అన్నాడు గద్గదంగా.

"నాకూ నూ అంతేరా! దారి పొడవునా నేనూ అవే ఆలోచిస్తూ వచ్చాను. ఎంత అమాయకపు రోజుల్రా!" అనుకుంటూ ఇద్దరం కాఫీ ఫలహారాలు పూర్తి చేసి రోడ్డంట పడబోతుండగా, "ఏమండీ! వేడి ఉప్పు నీరు పెట్టాను కాస్త పుక్కిలించి వెళ్ళండి. చలి గాలికి మళ్ళీ పన్ను నెప్పెడుతుందేమో!" అంది పరశురాముని ధర్మపత్ని. “అన్నీ నీకే తెల్సినట్లు చెప్పకు. నాకే పన్ను నెప్పిలేదు." అంటూ బయల్దేరదీశాడు నన్ను.

"పోనీ మాచెల్లాయి మాట విని కాస్త ఉప్పునీరు పుక్కిలించి రారాదుట్రా!" అన్నాను, కాస్త మాట వినే మనస్తత్వం వచ్చిందేమోని. ఊహూ వాడేమీ మారలేదు.

"ఈ ఆడాళ్ళకు లేనిపోని భయాల్రా! అన్నింటికీ కాస్తంతను కొండత చేసుకుని గాభరాపడి మనల్ని భయపెట్టే ప్రయత్నం చేస్తారు. పదరా విశ్శూ !వెళదాం." అంటూ నాచెయ్యి పట్టి బయటికి లాక్కెళ్ళాడు. చిన్నప్పటి కబుర్లు చెప్పుకుంటూ నడవసాగాం.

"ఏరా! ఎవరైనా మన జతగాళ్ళు ఈ ఊర్లో ఉన్నారా! ఎవ్వరూ కనిపించరేమిరా!" అన్నాను.

"మన సావాసగాళ్ళు ఎవ్వరూ లేరురా విశ్శూ! అంతా కొడుకుల దగ్గరికెళ్ళి పోయారు. ఈ పల్లెటూర్లో ఎవరుంటార్రా! నాకు మాత్రం ఈపల్లె వదలి వెళ్ళాలని లేదురా! అందుకేగా ప్రియ మిత్రుడివి నీవు ఇంజనీరింగ్ లో జాయినైనా నేను ఊరు వదలటం ఇష్టంలేక పంతులైన్ని ఉన్నఊర్లోనే ఉండిపోయా. ఈ ఊరుమాత్రం వదలనురా! మాతృభూమిరా మాతృభూమి!" అన్నాడు ఎంతో ఉద్రేకంగా.

వాడి పుట్టిన ఊరిపై ఉన్న భక్తికి నేను కాస్త అచ్చెరురువొందినమాట వాస్తవం.

"ఐతే ఎవ్వరూ ఇక ఇక్కడికి రానే రారా?" అన్నాను.

“అప్పుడప్పుడూ వస్తుంటారు. అంతేరా! ఇది చలి కాలం కదా! ఈ చలికి ఎవ్వరూ రారు ఇప్పుడు." అంటూ 'అబ్బా!' అని బుగ్గ పట్టుకుని మెలితిరిగి పోసాగాడు. నేను కంగారుగా "ఏమైందిరా" అంటూ వాడిని పట్టుకుని ఒక చెట్టు క్రింద కూర్చోబెట్టాను. కాస్త సేపయ్యాక పరశురాముడు తేరుకుని "మళ్ళీ పన్ను నొప్పి వచ్చినట్లుందిరా! గత నెల నుంచి వేపుకు తింటోంది." అంటూ బుగ్గ పట్టుకుని కూర్చున్నాడు బాధగా.

"మన ఆయుర్వేద వైద్యాచారి గారు ఉన్నార్రా!" అన్నాను. "ఆహా ఉన్నారు. ఆయన చలవ్వల్లే నేనింత హాయిగా ఉంటున్నాను." అన్నాడు అంత బాధలోనూ కృతజ్ఞతగా కళ్ళు మూసుకుని. ఆ మూసుకోడం బాధ తోనో, భక్తితోనో తెలిక అయోమయంలో పడ్డానేను.

"మరి ఆచారిగారి ఇంటికెళదాం పద ఆయన్ని చూసినట్లుంటుంది." అని పరశురాముడ్ని లేవదీసి నడిపించుకుంటూ ఆచారి గారిల్లు చేరాం.

"నమస్కారం! ఆచారిగారూ! నేను గుర్తున్నానా సార్!" అనగానే "మీ పరశురాముడు గుర్తున్నన్ని నాళ్ళూ నీవు గుర్తుంటావోయ్ విశ్శూ! చెలికాడ్ని చూసేందుకు వచ్చా వేంటోయ్! ఏమోయ్! పరశురామూ! ఏమైందేం?" అంటూ ఇద్దర్నీ ఒకే మారు పలకరించారు. వయస్సు వచ్చినా ముసలితనం ఆయన్లో కనిపించనందుకు ఆశ్చర్యమేసింది. మేమే విశ్రాంతి పొందగా ఆయన షుమారుగా ఎనభయ్యోపడిలో ఉన్నా మాకంటే లేతగా ఉన్నట్లున్నారు. మావాడు వాని పన్ను నెప్పి గురించి విన్నవించుకున్నాక "ఇదో ఈ పొట్లాలు వేడి నీళ్లలో వేసి రోజుకు మూడు మార్లు పుక్కిలించి, ఈపొడి కాస్తంత నెప్పి ఉన్న పన్నుకు అతికించి పది నిముషాలుంచు, మూడు రోజుల్లో నెప్పి మటు మాయమైపోతుంది. ఆతర్వాత వచ్చి మా కుమారుడు పళ్ళడాక్టర్ వాడి సలహా తీసుకో, నేను దగ్గరే ఉంటాన్లే భయపడకు." అని చెప్పి జేబు తైలం వదిలించి పంపాడు.

ఇంటికి వచ్చాక విషయమంతా విన్న పరశురాం శ్రీమతి మండి పడింది. "చూడండి అన్నయ్యగారూ! మీ స్నేహితుడు, నేనిచ్చిన ఉప్పు కాదని, ఆచారి ఉప్పు కప్పురం లాగా డబ్బిచ్చి కొని తెచ్చారు! నేచెప్పిందీ ఆచారిగారు చెప్పిందీ ఒక్కటే, ఐనా శంఖం లోదే తీర్థంకదా!" అని చిట పట లాడి వేన్నీళ్లలో ఆమందుపొట్లం వేసి తెచ్చిచ్చింది.

"మీ స్నేహితునికి పిచ్చి ఇంతా అంతా కాదండీ అన్నయ్యగారూ! మావాడి దగ్గరకు అమెరికా వెళ్ళేప్పుడు ఈయన చేసిన అల్లరి అంతా ఇంతా కాదు. ఆరు నెల్లకు మూడు శేర్ల కుంకుడు గుండ, మూడు శేర్ల శికాకాయ గుండ, రెండుశేర్ల వేపగుండ, శేరుంబావు శొంఠిగుండ అన్నీ కలిపి ఒక సంచిలో సర్దారు. చెకింగ్ చేసేప్పుడు వాళ్ళగోల 'ఇవన్నీ ఏంటని?!' నేనేదో ఆయన గారికి వంటికి డాక్టర్లిచ్చిన మందని నచ్చ చెప్పేసరికి తలప్రాణం తోక్కొచ్చిందంటే నమ్మండి. ఆచారి మందు మీదున్న నమ్మకం కట్టుకున్న నామీద లేదండీ!" అని వాపోయింది. 'కన్నవాళ్ల మీదే లేదుతల్లీ ఇహ నీమే దెలా వస్తుందా' ని మనస్సులో అనుకున్నాను.

మూడురోజులకు పన్ను నెప్పితగ్గాక మాపరశురాముని శ్రీమతి కోరిక మేరకు నేను దగ్గరుండి ఆచారిగారి కుమారుడు పళ్ళడాక్టర్ గారి వద్దకెళ్ళాం. పళ్ళడాక్టర్ పరీక్షించి పన్నుపీకాలనీ బాగా పుప్పి పట్టిందనీ చెప్పాడు. ససేమిరా ఆచారి గారి వైద్యంతప్ప మరేమీ చేయించుకోనని మొండి పట్టు పట్టాడు పరశురాముడు. చివరకు ఆచారిగారు "అయ్యా! పరశురామూ! నేను దగ్గరుండి చూస్తాగా! నీకేమీ భయంలేదు" అని నచ్చజెప్పి, మత్తు మందిచ్చి పన్నుపీకాక, ఆపన్ను చూపాడు పరశురాముకు దాన్నిండా ఏదేదో అంటుకుని నల్లగా పుచ్చిపోయి ఉంది. లోపలంతా డొల్ల.

"చూడండి పరశురాముడుగారూ! మీకు మానాయనగారి మీదున్న నమ్మకానికి సంతోషమే కానీ పళ్ళకు పళ్ళ డాక్టర్నీ, కళ్ళకు కళ్ళడాక్టర్నీ, చెవికి చెవి డాక్టర్నీ, గుండెకు గుండె డాక్టర్నీ ఇలా ఆయా వైద్యం తెలిసిన వారిని సంప్రదించాలి. ఈ రోజుల్లో ఒకే వైద్యుడు అన్నీ బాగు చేయలేరు. ఈ విషయం ఈయన మానాయన గారైనా చెప్తున్నాను. మీకూ వయసవుతున్నది కంటి నొప్పికీ మానాయన గారెలా మందిస్తారు చెప్పండి. కనుక నామాట విని ఒకమారు పట్నం వెళ్ళి ఫుల్ చెకప్ చేయించుకోండి మంచిది..." అనిచెప్పిన పళ్ళడాక్టర్ మా పరశురాముని కంటికి, మనస్సుకూ శ్రీకృష్ణ పరమాత్మలా కనిపించి ఆయన చెప్పినట్లే చేయను అంగీకరించాడు.

తన పన్ను నొప్పిలేకుండా పీకి నందుకో, ఆచారికొడుకైనందుకో, మరెందుకో గానీ ఆయన మాట వేదవాక్కైంది మావాడికి. ఇన్నాళ్ళకు ఆచారి గారికి ప్రత్యామ్నాయంగా మరో బోధకుడు మాపరశురామునికి దొరికినందుకు నేనెంతో సంతోషించాను...

***



సాయంత్రం 5 గంటలయింది. ప్రభుత్వ పాఠశాల గంట గణగణ మోగిందే తడవు... తరగతి గదుల్లోంచి విద్యార్థులు వింటి నుంచి దూసుకువచ్చిన బాణాల్లా రివ్వున ఇంటి దారి పట్టారు. తొమ్మిదో తరగతి చదువుతున్న రమణ, రాఘవ కబుర్లాడుకుంటూ నడవసాగారు. రమణ ఏదో ఆలోచిస్తూండటంతో భుజమ్మీద చెయ్యేస్తూ. “ఏరా రమణా! అలా ఉన్నావ్? మధ్యాన్నం లెక్కల పరీక్ష సరిగ్గా వ్రాయలేదా ఏంటి?” అనడిగాడు రాఘవ. ఉలిక్కిపడి రాఘవ వైపు చూస్తూ” ఆ పరీక్షా? బాగానే వ్రాసాలే!" అంటూ ఎదురుగా కన్పిస్తున్న ఇంగ్లీష్ మీడియం స్కూల్ వైపు దృష్టి నిలిపాడు. మిత్రుడి మనసు గ్రహించినట్లుగా “బాగా చదువుకొని పెద్దయ్యాక అక్కడే టీచర్ అవుదువు లేరా!” అన్నాడు రాఘవ నవ్వుతూ.

రమణ, రాఘవ పక్క పక్క ఇళ్ళల్లో ఉంటున్నారు. తండ్రులు ఆటో వేస్తుంటే తల్లులు నాలుగిళ్ళల్లో పనిపాటలు చేసుకుంటూ సంసారాన్ని గుట్టుగా నెట్టుకొస్తున్నారు. రమణ అన్న పాలిటెక్నిక్ చదువుతుంటే రాఘవ తమ్ముడు నాలుగోతరగతి లో ఉన్నాడు. తాము చదువుకోలేకపోయినందుకు పిల్లల్నయినా బాగా చదివించి ప్రయోజకుల్ని చేయాలని వాళ్ళ తల్లితండ్రుల తాపత్రయం. పిల్లలు కూడా ప్రభుత్వ పాఠశాలలో కష్టపడి చదువుకుంటూ తల్లిదండ్రుల కలల్ని సాకారం చేసే ప్రయత్నంలో ఉన్నారు.

రమణ కి తమ పాఠశాల ఎదురుగా ఉన్న కాన్వెంట్ అంటే విపరీతమైన ఇష్టం. అక్కడకి కార్లల్లో వచ్చే ఖరీదైన విద్యార్థుల్ని, వాళ్ళు వేసుకునే ముచ్చటైన యూనిఫాం ని చూస్తూ తను వాళ్ళల్లా లేనందుకు న్యూనతకి లోనవుతూ, వాళ్ళ స్థాయికి ఎప్పుడు చేరగలనా అని మధనపడసాగేడు.

ఆరోజు ఆదివారం కావడంతో రమణ క్రికెట్ ఆడుకోవడానికి స్కూల్ గ్రౌండ్ కి వెళ్ళేసరికి అక్కడ అప్పటికే కాన్వెంట్ పిల్లలు ఆడుతూ కన్పించారు. తన ఫ్రెండ్స్ ఎవరూ లేకపోవడంతో వెనక్కి తిరుగుతోంటే ఒకబ్బాయి పరుగెత్తుకుంటూ దగ్గరకి వచ్చి "ఏయ్ బాబూ! మాతో ఆడతావా? మా టీమ్ లో ఒకరు రాలేదు" అంటూ చనువుగా చేయి పట్టుకొని తీసుకువెళ్ళాడు. రమణ ఊహించని ఈ ఆహ్వానానికి అబ్బురపడుతూ అద్భుతంగా బ్యాటింగ్ చేసి అందరి ప్రశంసలు అందుకున్నాడు. తర్వాత ఆ కుర్రాడు తన పేరు "కిరణ్" అని చెప్పి "ఇక్కడే మా ఇల్లు రా వెళ్దాం!" అంటూ ఇంటికి తీసుకువెళ్ళాడు.

ఇల్లు అనేకన్నా ఇంద్రలోకం అంటే బాగుంటుందేమో? కిరణ్ వాళ్ళమ్మ గారు ప్రేమగా పలకరించి హల్వా పెట్టి జ్యూస్ ఇచ్చారు రమణ కి. కిరణ్ గది చూసి మతి పోయినంత పనయ్యింది. వచ్చేస్తోంటే మంచి పెన్ బహుమతిగా ఇచ్చాడు కిరణ్ రమణకి. ఇంటికి వచ్చాక కూడా కళ్ళల్లోనూ, కలల్లోనూ కిరణ్, కిరణ్ వాళ్ళ ఇల్లే కన్పిస్తూ ఉండటంతో మనసు మరీ భారమైపోయింది రమణకి. తన దరిద్రానికి, దురదృష్టానికి దుఖపడుతూ దేవుడు తనకి అన్యాయం చేశాడని వాపోసాగాడు. ఎప్పుడైనా సిన్మా కి వెళ్దామన్న అప్పుల లిస్టు, ఖర్చుల లిస్టు ముందు పెడుతుంది అమ్మ. ఏదైనా కొనమంటే చాలు ఎంత నోరు, పొట్ట కట్టుకొని తమని చదివిస్తున్నారో ఏకరువు పెట్టి తర్వాత చూద్దాంలే ముందు కష్టపడి చదువు అంటాడు నాన్న. ఎప్పటికీ ఈ బతుకింతే! తను ఎప్పటికీ కిరణ్ స్థాయి కి చేరలేడు... విరక్తిగా అన్పించసాగింది రమణకి.

రాఘవతో స్కూల్ కి వెళ్ళేటప్పుడు తన మనసు లోని వేదనని వెళ్లగక్కితే "మనం బాగా చదువుకొని త్వరగా పెద్దయిపోయి మంచి ఉద్యోగం తెచ్చేస్కొని కావాల్సినవన్నీ కొనేస్కుందాం రా ఎంచక్కా! మా అమ్మ ఎప్పుడూ ఇదే చెప్తుంది." అన్నాడు కళ్ళు, చేతులు తిప్పుతూ. ఏడవలేక నవ్వుతూ "సరేలే" అన్నాడు రమణ.

ఎప్పటిలాగే స్కూల్ నించి ఇంటికి వస్తున్నారు రమణ,రాఘవ. "ఏయ్ రమణా! అటు చూడు" రాఘవ అరిచిన అరుపుకి ఒక్కసారి ఉలిక్కిపడి చూశాడు. పెద్ద గుంపు రోడ్డు వారగా! ఏంటో చూద్దామని ఇద్దరూ సందు చేసుకొని గుంపులో జొరబడ్డారు. ఒక నడివయసు వ్యక్తి పాములనాడిస్తున్నాడు. నాగస్వరం ఊదుతుంటే రెండు పాములు తలలు తిప్పుతూ నాట్యం చేస్తున్నాయి. మూగిన జనాల్లో కొందరు చప్పట్లు కొడుతోంటే, కొందరు ఈలలేస్తున్నారు. స్నేహితులిద్దరికీ ఆశ్చర్యం గా ఉంది. సిన్మాల్లో చూడ్డమే తప్ప, ప్రత్యక్షంగా వాళ్లెప్పుడూ పాముల్ని చూడలేదు. అందుకే చాలా ఉత్కంఠ గా చూడసాగారు ఈ దృశ్యాన్ని. ఇంతలో పదేళ్ళ పిల్ల, ఆరేళ్ళ పిల్లాడు చేతిలో సత్తుగిన్నెలు పట్టుకొని అందరి దగ్గరకొచ్చి "మా అమ్మకి జరం, రెండు రోజుల నించి అన్నం తినలేదన్నా! ఇంటి కాడ సిన్న తమ్ముడికి పాల్లేవన్నా! మా పాములక్కూడా తిండి లేదు. శానా ఆకలేస్తుంది,

డబ్బులియ్యండన్న" అంటూ యాచించ సాగారు. చూస్తున్న రమణ మనసు ద్రవించిపోయింది. ఏం చేద్దామన్నట్టు రాఘవ వైపు చూశాడు. వాడు రహస్యంగా "సాయంత్రం ఏమైనా కొనుక్కోడానికి అమ్మా వాళ్ళిచ్చిన డబ్బులున్నాయిగా! ఇవాళేమీ తినద్దులే! ఒక్క రోజు తినకపోతే ఏం కాదులే" అన్నాడు. రమణ సంతోషంగా జేబులోంచి పది రూపాయల నోటు తీసి బొచ్చెలో వేశాడు. అంతవరకు చిల్లర నాణేలు తప్ప నోటు ఎవరూ వేయలేదు. పది నోటు చూడగానే పిల్ల కళ్ళు ఆనందంతో మెరిసాయి. "ఇయ్యాల కూడు తినొచ్చు నాన్నోయ్" అంటూ తండ్రి దగ్గరకి పరిగెత్తింది. పిల్లలు తెచ్చిన డబ్బులు లెక్కపెట్టుకుని, పాముల్ని బుట్టలో పెట్టి మూత పెట్టే పన్లో ఉన్నాడు పాములతను.

రాఘవ అతని దగ్గరకొచ్చి ఆశ్చర్యంగా "అమ్మో, ఇలా పాముల్ని నెత్తిన పెట్టుకొని తిరుగుతూ ఉంటావు కదా! అవి కరిస్తేనో? భయం లేదా?" అని అడిగాడు."లేదు బాబూ! ఇవి శానా మంచివి. కావాలంటే సూడు" అంటూ వాటిని ముద్దు చేయసాగాడు పాములతను. "అంటే ఇవి నిజమైన తాచుపాములు కావా?" కుతూహలంగా అడిగేడు రమణ "కావు బాబూ! నిజమైన తాచు మా పేదరికం బాబూ, పతిరోజూ అది మమ్మల్ని కాటు యాత్తానే ఉంటాది. రోజూ చస్తూ బతుకుతూ ఉంటాం. ఆ పాము మమ్మల్ని కాటేసి చంపేత్తే ఈ పాములు పేనం పోసి బతికిత్తన్నాయి. ఇవి మా పాలిటి దేవుళ్ళు బాబూ అందుకే ఈటిని నెత్తినెట్టుకొని తిరగతన్నా, ఒత్తా బాబూ!" అంటూ పిల్లల్ని తీసుకొని అక్కడనుంచి వెళ్లిపోయాడు.

అంతే, ఒక్కసారిగా వీపుమీద ఎవరో చెళ్లుమని చరిచినట్లయింది రమణకి. ఇంతకాలం తానెంత మూర్ఖంగా ఆలోచిస్తూ అనవసర వేదనకి గురయ్యాడో తెలిసి వచ్చింది. తనకంటే బీదవాళ్లు, అభాగ్యులు ఈ లోకంలో చాలా మందే ఉన్నారు. భగవంతుడు తనకి కావలిసినవన్నీ ఏదోకాస్త అటూఇటూగా అందించే తల్లితండ్రులని, ఎవరి దయాధర్మం మీదా ఆధారపడకుండా కూడు, గుడ్డ, నీడ లో తన కాళ్ళ మీద తాను నిలబడేందుకు అవసరమైన, చదువు కి కావలసిన తెలివితేటల్ని అన్నీ ఇచ్చాడు. ఇంతకంటే ఏం కావాలి? ఆ పాములతని కంటే తానెంతో అదృష్టవంతుడు. అదే మాట రాఘవ తో అన్నాడు. "అవున్రా రమణా! మా అమ్మ ఎప్పుడూ చెప్పేది ఈ మాటే రా! మన కంటే గొప్పవాళ్లతో కాకుండా మన కంటే బీదవాళ్లతో పోల్చుకొని మనం చాలా అదృష్టవంతులం అనుకోవాలట. ఈపాటి ఆధారం, ఆరోగ్యం మనకిచ్చినందుకు ఆ దేవుడికి కృతజ్ఞతలు చెప్పుకోవాలటరా!" చెప్పాడు రాఘవ.

"నిజమేరా రాఘవా! మన కంటే బీదవాళ్ల పట్ల జాలి చూపించాలి. మీ అమ్మ చెప్పినట్లు కష్టపడి పట్టుదలగా చదివి మనం కూడా గొప్పవాళ్ళమవ్వాలి." అన్నాడు మెరిసే కళ్ళతో రమణ. "అప్పుడు బీదవాళ్ళకి సాయం చేయచ్చు కూడా" అంటూ శృతి కలిపాడు రాఘవ.

***




"సంక్రాంతి పండగ ఇంక నాల్రోజులే వుంది. మనం ఊరెళ్ళాలి. నువ్వు లీవ్ పెట్టి తొందరగా బస్ టికెట్లు తీసుకో... లేకపోతే చాలా ఇబ్బందవుతుంది. "పొద్దున్నే ఆఫీసుకి హడావుడిగా బయల్దేరబోతున్న నా దగ్గరకొచ్చి అమ్మ చెప్పింది.

హైటెక్ సిటీలో సాఫ్ట్ వేర్ టీమ్లీడ్ గా పనిచేస్తున్నాను. ఆఫీసులో పండగ సమయానికి ఏవన్నా అర్జంట్ టాస్క్ లు వస్తాయేమోనని నేనే ఇప్పటిదాకా టికెట్లు తీసుకోలేదు. కానీ ప్రస్తుతం అంత బిజి ఏం లేదు. అందుకే అమ్మకి 'సరే' అని నవ్వుతూ చెప్పి ఆఫీసుకి బయల్దేరాను.

నేను చదువుపూర్తి చేసుకుని ఉద్యోగంలో చేరి సంవత్సరమవుతోంది. నాన్న రిటైరయ్యి నెలవుతోంది. నేనూ అన్నయ్యా ఇద్దరమే పిల్లలం. అన్నయ్య లక్నో లో ఉద్యోగం చేస్తున్నాడు. వాడు చాలా బిజి మనిషి. వాడెంత బిజి అంటే కనీసం ఫోన్లోనన్నా తన క్షేమ సమాచారాలు అందివ్వడు. నేనే సెల్ కి చేసి కనుక్కుని అమ్మా నాన్నకి చెబుతుంటాను. ప్రతి పండక్కి కాకపోయినా పెద్దపండగలకి మా సొంతూరికెళ్ళడం మాకు ఆనవాయితీ అయిపోయింది. మాకేంటీ అసలు సిటీలో డెబ్భై శాతం పల్లెటూళ్ళకి పరుగులెడతారు. ఎందుకు?

అక్కడ మన సంస్కృతి సంప్రదాయం పచ్చగా వుంటాయి. ఈ సిటీల్లో బిజీ బిజీగా గజి బిజిగా గడిపిన మనకి పల్లెటూళ్ళకి వెళ్ళి సేదదీరడం ఓ ఆటవిడుపు. నిజంగా మానసికంగా చాలా రెజొవెనెట్ అవుతాం.

ఆన్ లైన్లో బస్ కి టికెట్లు దొరకక పోవడంతో... సాయంత్రం ఆఫీసులో తొందరగా పనిముగించుకుని టికెట్లకోసం ప్రైవేటు బస్ ఆపరేటర్ల దగ్గరకి వెళ్ళాను. మాడదిరే రేటు చెప్పారు. ఏం చేస్తాం? ఆర్టీసికూడా అదనపు ఛార్జీలు వసూలు చేస్తోంది... ఇంక ప్రైవేటు బస్ ల వాళ్ళు ఊరుకుంటారా! దొరికినంతా దోచుకోవడానికి సిద్ధం! మూడు టిక్కెట్లు తీసుకుని ఇంటికొచ్చాను.

"ఏరా... టికెట్లు దొరికాయా?" అమ్మ ప్రశ్నలో ఆత్రం.

టికెట్లు అమ్మ చేతిలో పెట్టాను.

అమ్మ ఆనందం అంతా ఇంతా కాదు. ఆవును మరి మాకోసం అహర్నిశలూ శ్రమిస్తూనే వుంటుంది. ఇలా ఊరికెళ్ళినప్పుడే కదా అమ్మకి కాస్త విశ్రాంతి. తన వాళ్లని చూసుకుని... తనవాళ్ళ మధ్య గడిపితే ఎంతో సంతోషం తనకి.

***

మేము ఊళ్ళోకి అడుగుపెట్టాం.

దిగింది మొదలు ఇంటికి చేరేవరకు అందరూ ఆప్యాయంగా పలకరించడమే! సిటీలో మన పక్కవాళ్ళు కూడా మనతో మాట్లాడకపోవడం ఖచ్చితంగా గుర్తొచ్చి తీరుతుంది.

అమ్మమ్మా, తాతయ్యా, మామయ్యా... అత్తయ్యలు... వాళ్ళపిల్లలు అందరూ అభిమానంగా దగ్గరకు తీసుకుని కుశల ప్రశ్నలు వేశారు. ఇంత అనుబంధం ఇక్కడతప్ప ఇంకెక్కడ సాధ్యమవుతుంది? పండగలని అనుభూతించాలంటే పల్లెటూళ్ళకి వెళ్ళాల్సిందే!

పండగ మొదటిరోజు భోగి.

తెల్లవారు ఝామునే లేచి ఇంట్లో వున్న పాత తట్టా బుట్టా చెక్కలు వేసి భోగి మంట వేశారు. అప్పటిదాకా శరీరాన్ని వణికించిన చలి వేడి దెబ్బకి దూరంగా పారిపోయి మంట ఎప్పుడు ఆరిపోతుందా ఎప్పుడు మళ్ళీ దాడి చేద్దామా అన్నట్టు ఎదురుచూస్తోంది. ఎనిమిదింటిదాకా సరదాగా చలికాచుకుని వేపపుల్లలతో పల్లు తోముకుని తాటాకులతో నాలిక గీసుకుని గోదావరిలో స్నానం చేసి ఇంటికొచ్చాం. పసుపుపెట్టిన కొత్త బట్టలు రెడీ. అవి వేసుకుని పెద్ద వాళ్ళ కాళ్ళకి దణ్ణం పెట్టి వేణుగోపాలస్వామి గుడికి వెళ్ళాం. ఇంటికొచ్చేసరికి రక రకాల పిండి వంటలు నాసికాపుటాల ద్వారా జిహ్వ కవాటాలు తెరుస్తూ సిద్ధంగా వున్నాయి. ఇక ఆగలేకపోయాము. సిటీలో అయితే కడుపుని కొలుచుకుంటూ... వ్యాధులకి భయపడుతూ 'ఏదో బ్రతకడానికి ఇంత తిన్నామనిపించే' మేము భుక్తాయాసంతో లేచాము. సాయంత్రం సరదాగా జరిగిన కోడి పందాలు చూడ్డం నిజంగా ఒక వేడుక.

రెండో రోజు పెద్ద పండగ సంక్రాంతి.

పరికిణీ ఓణీలేసుకున్న పడుచుపిల్లలు ఇంటిముందు పేడ కళ్ళాపిజల్లి అందమైన ముత్యాల ముగ్గులేసి గొబ్బెమ్మలు పెట్టి వాటిని రక రకాల పూలతో అలంకరించడం చూడ చక్కనైన దృశ్యం. గంగిరెద్దుల ఆట... వాటి దీవెన, హరిదాసుల 'హరిలో రంగ హరి' కీర్తనలు ఓహో అద్భుతం.

కొత్త బట్టలు... పిండి వంటలు షరా మామూలే!

మా కుటుంబ శ్రేయస్సుని కాంక్షించే అయ్యగారు పెద్దలచేత పూజలు పూర్తి చేయించి మమ్మల్ని పదికాలాలపాటు చల్లగా ఉండమని దీవించడం, మధురాతిమధురమైన అనుభూతి.

కొత్త పంటలు చేతికొచ్చిన ఆనందంతో మా తాతగారు చేతికి ఎముకలేకుండా దాన ధర్మాలు చేస్తున్నారు. ఇక్కడ మనం గీసి గీసి 'బార్ గైన్' చేస్తే అక్కడ ఉదారంగా అలా ధారపోయడం ఆశ్చర్యపరచింది. అదే విషయం తాతయ్యని అడిగితే..'కలిమి కలిగిన రోజున పదిమందికిస్తే, లేని రోజున నలుగురూ సాయానికొస్తారు. మనకున్నదాన్ని మనం తినడం ఎప్పుడూ గొప్ప కాదు. పదిమందికీ పెట్టడమే గొప్ప' అన్నాడు.

ఎంత గొప్ప సమానత్వపు సమాధానం. పట్నంలో రాను రాను మనిషి పరిధి చిన్నదైపోతోంది. 'తను... తన లోకం' అంతే!

కనుమ రోజు.

మాకు సిరి సంపదల నిచ్చిన పశుజాతికి కృతజ్ఞతలు చెప్పి... కమ్మని మినప గారెలూ అల్లంపచ్చడీ తిన్నాం. ఈరోజు ప్రయాణం చేయకూడదు కాబట్టి మరుసటిరోజు ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకుంటున్నాము. ఇల్లూ, అందరి మనసులు బోసిపోయాయి.

"అందరూ ఉంటే ఇలా ఇల్లు కళ కళ్ళాడుతుంది. మీరందరూ తలోదిక్కుకీ వెళ్ళిపోతారు... రేపటినుండి... ఈ ఇంట్లో సందడీ... సంబరం ఉండదు" అన్నాడు తాతయ్య బాధగా.

ఇన్ని రోజులూ మాకోసం అంత శ్రమించిన అమ్మమ్మకి కూడా మేము వెళ్ళడం బాధ కలిగిస్తోంది.

"అంత శ్రమ పడ్డావు. హాయిగా విశ్రాంతి తీసుకోక మా కోసం ఎందుకే అమ్మమ్మా అంత తాపత్రయ పడతావు?" అని అడిగాను.

"అది శ్రమేంట్రా... మీరు కడుపునిండా తింటూ నా వంటని అప్యాయంగా మెచ్చుకుంటుంటే ఇంక నాకేం కావాల్రా! రేపటి నుండి ఎవరి బాధ్యతల్లో వాళ్ళు కూరుకుపోయి అర్ధాకలితోనే వుంటారని నా బెంగ" అంది.

నా కళ్ళు చెమర్చాయి.

"తాతయ్యా నేనో మాట చెప్పనా..."అన్నాను.

తాతయ్య చెప్పమన్నాడు. అందరూ నేనేం చెబుతానా అని ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"మేము పెద్ద పండగలకి మా స్వార్థంతో ఇక్కడకొచ్చి సంతోషాన్ని మనసుల్లో మూటగట్టుకుని వెళ్ళిపోతున్నాం గాని. మీ గురించి మీరెప్పుడైనా ఆలోచించుకున్నారా? ఎన్నో సంవత్సరాల్నుండి ఈ ఊరు ఈ ఇల్లూ ఇలాగే వుంది. మా నగరాలు క్షణం క్షణం

మారిపోతున్నాయి. ఈ ఊళ్ళు మాత్రం ఎలాంటి ప్రగతి లేకుండా ఇలాగే వుంటాయి. ఇక్కడి మట్టిరోడ్లు... గుడుల గోపురాలు... బడులు... చెఱువులు... మాకు గొప్ప గొప్ప అనుభూతులుగా కథలు కవితలు రాసుకుంటాం. అక్కడ మాకు మాల్స్ కావాలి... మల్టీప్లెక్స్ లు... ఫ్లై ఓవర్లు కావాలి... మీరు మాత్రం మాకు ఇలాగే వెనకబడిన తనంతో కావాలి. మేము సేదదీరడానికి ఒక పార్కులాను... ఫామ్ హౌస్ లాను ఊరుండాలి. నగరాలనుండి పండగలకి డెబ్భైశాతం జనం పల్లెటూళ్ళకి వస్తున్నారంటే ఇక్కడి కమ్మదనం మమ్మల్ని ఎంతగా ఆకర్షిస్తోందో తెలుస్తోంది కదా! అలాంటప్పుడు నగరాలని మన సంస్కృతి సంప్రదాయాల వేదికగా చేసుకోవచ్చుకదా! ఊహుఁ... మా సుఖాలు మాక్కావాలి... అప్పుడప్పుడూ ఇలాంటి అనుభుతులూ వుండాలి! స్వార్థం తాతా... ప్రతి మనిషికి నిలువెల్లా స్వార్థం! మీ ప్రేమాభిమానాలని మేము మా స్వలాభానికి వాడుకుంటున్నామంతే! ఇక్కడ నిత్యకృత్యంగా కనిపించేవి, నగరంలో మేము ఊరికి దూరంగా శిల్పారామం అని ఏర్పాటు చేసుకుని చూసి వస్తుంటాం తెలుసా తాతా! అమ్మమ్మ ఆప్యాయంగా వండి వడ్డించే పదార్థాలు అక్కడ స్వగృహ ఫుడ్స్. డబ్బు పడేస్తే ఏదైనా చూడొచ్చు... తినొచ్చు... కానీ అనుభూతించలేం. మమ్మల్ని మా స్వార్థాన్ని క్షమించు తాతయ్యా!" అన్నాను మనస్ఫూర్తిగా కళ్ళనీళ్ళతో!

తాతయ్య నా తల నిమురుతుండిపోయాడు.

***




"ఏమండీ! ఈఏడాది కుంభమేళా ఏర్పాట్లు పెద్ద ఎత్తున చేస్తున్నారట, మనము కూడా అలహాబాదు వెళ్దామా? అందులోను, ఇది మహా కుంబామేళాట కూడాను. 144 సంవత్సరాలకు ఒకసారి మాత్రమే వస్తుందట. ఎలాగు మీరు రిటైర్ అయ్యాక మనం కాశి, ప్రయాగ వెళదామని అనుకున్నాము కదా, ఈ కుంభమేళా రూపేణా ముందే వెళదాము. ఆ త్రివేణి సంగమంలో 'వేణి దానం' చేసి చక్కగా స్నానాలు చేద్దాము; ఎంతో పవిత్రమైన ప్రదేశం, మళ్ళీ ఈ జన్మలో ఈ భాగ్యం దక్కదు మనకి" అని అంటూ అప్పుడే అక్కడికి వెళ్ళిపోయినట్లు, ఈస్ట్ మన్ కలరులో ఊహించుకుంటూ నేను ఎంతో ఉత్సాహంగా చెప్పేస్తుంటే దానికి ఆయన తాడి ఎత్తంత యెగిరి "ఠఠ్! ససేమిరావద్దు అంటేవద్దు" అని అరిచారు.

"ఏం? ఎందుకు?" అని  నేను కూడా గట్టిగానే అడిగాను.

“ఎందుకా? అక్కడ అసలు జనం ఎలావున్నరో తెలుసా? ఒక్కసారి టీవీ లో చూడు ప్రపంచంలో వున్న మనుషులందరూ అక్కడే వున్నట్లు వున్నారు. ఆ కిక్కిరిసిన జనం మధ్య ఒక్క స్నానమైనా చెయ్యగలమా? చక్కగా హాయిగా ఇంట్లో కూచుని టీవీ లో చూడు” అంటూ హితోపదేశం చేసారు.

అంతే వెంటనే నా ఉత్సాహం అంతా నీరు గారిపోయింది. నాకు ఉక్రోషం వచ్చి “ఇదిగో పెద్దమీరు ఎక్కడికన్నా వెళ్దామంటే ఇంట్రెస్ట్ వుండదు. అదే మాఆర్మీ బావ, అదే మాకృష్ణ బావ చక్కగా పెళ్ళాన్ని తీసుకొని అన్ని ఊళ్ళు, అన్ని పుణ్యక్షేత్రాలు తిప్పుతాడు” అని అన్నాను.

“అదే నాకు మండుతుంది. వేరే వాళ్ళతో నన్ను పోల్చద్దు. ఇప్పుడు కుంభమేళా గురించి మాటలాడుతూ మీ బావని ఎందుకు తీసుకువస్తావు? ఆయన రిటైర్ అయ్యి జమానా అయ్యింది. ఎక్కడికక్కడే అన్నీ జరిపించుకొంటూ, పైగా నాకు ఇంట్రెస్ట్ లేదన్న మాట మాత్రం పైకి వస్తుంది. అని రుసరుసలాడుతూ చదువుతున్న న్యూస్ పేపరిని అక్కడ పారేసి విసవిసా బయటికి వెళ్లిపోయారు.

ఆయనకి కొంచెం ప్రధమ కోపం, తరువాత నెమ్మదిగా చెబితే వింటారు. చితుకుల మంటలా కొంత సేపే ఉంటుంది. తరువాత నిజంగా శ్రీ రామ చంద్రమూర్తే!

‘ఈ మనిషితో ఇన్నేళ్ళుగా ఎలా వేగావే రాజ్యలక్ష్మి’ అని నాకు నేనే భుజం తట్టుకున్నాను. ఇంతలో మనసు లోకి ఒక అద్భుతమయిన ఆలోచన వచ్చింది. అది కార్యరూపం దాల్చాలంటే నేను కొంత శ్రమపడాలి. సరే మరి! కొన్ని కావాలంటే కొన్ని చెయ్యాలి కదా! ఆయనకు ఇష్టమైన సొజ్జప్పాలు, కజ్జి కాయలు చెయ్యడానికి వంటింటిలోకి వెళ్ళాను. అవును దీన్ని లంచమే అంటారు! ఏం చెయ్యమంటారు మరి నాపని కావాలంటే ఇలాంటి ముడుపు చెల్లించాల్సిందే. నా పనంతా అయ్యేసరికి భోజనాల వేళ అయింది. నేను వంటింట్లోంచి ఆయనను గమనిస్తూనే వున్నాను. బయటనుంచి వస్తూనే “రాజ కాఫీ ఇయ్యి” అని గట్టిగా అడిగారు. వెంటనే “ఎట్ యువర్ సర్వీస్” టైపు లో తెలుగు సీరియల్స్ లో అమాయకపు కోడలులాగా తీసికెళ్ళి ఇచ్చాను. అదే మాములుగా అయితే ఇప్పుడు అన్నం తినే టైములో ఏమిటండి అంటూ కయ్యిమనే దాన్ని. కాని ఇప్పుడు నేను శాంతి మంత్రం పఠిస్తున్నాను. అందులో కార్యం సానుకూలం చేసుకోవాలంటే కొంత సహనం తో వుండాలి. భోజనం అయ్యాక కాసేపు రెస్ట్ తీసుకొని కుంభమేళా కి వెళ్ళడానికి కావలిసిన సమాచారం మా ఇంటి ఎదురు ఫ్లాట్ లో వుండే శ్యామల గారి దగ్గర తీసుకున్నాను. వాళ్ళు కూడా వెళదామని అనుకొంటున్నారు. ఆవిడ సరదాగా మనం కలిసివెళ్దామని అన్నారు. నేను ఈ రోజు రాత్రికల్లా మీకు ఏ సంగతో చెప్పేస్తాను అని పరుగున ఇంట్లోకి వెళ్లి ఐ పాడ్ లో ‘మాస్టర్ చెఫ్’ కార్యక్రమాలు చూస్తున్న శ్రీవారిదగ్గరే కూచున్నాను. ఒకప్పటి వర్ధమాన హీరోయిన్లా ఆయా చిత్రాలలో తమ భర్తల దగ్గర ఎంతోఅణుకువగా, ఎంతో భక్తిగా, ఆరాధనగా వుండి తమకి కావలిసిన పనులు చేయించుకున్నారో గుర్తు తెచ్చుకొని.

“ఏమండీ” అని ఎంతో ఇదిగా పిలిచాను.

“ఏమిటిసంగతి చెప్పు” అన్నారు ఐ పాడ్ నుంచి కళ్ళు తిప్పకుండానే.

“మరేమీ లేదు, మీరు నేను చెప్పినది విని ఊ అనాలి” అన్నాను.

“ఊ”

“మనఎదురింటి శ్యామలగారు, కృష్ణమూర్తి గారు కూడా మహాకుంభమేళా కి వస్తారట. మనం అందరం కలిసి వెళదాం” అని భయం, భయంగా చెప్పాను.

“ఎవరు? మన యోగ కృష్ణమూర్తి గారా? అవునూ కొంచెం ఆయనకి చెవుడు కూడా కదా! సరేలే టికెట్స్ బుక్ చేయమని అయనకు చెప్పు, హోటల్ అది నేను చూస్తాను. ఇదిగో ఇంకో మాట ‘ఏసి’ కోచ్ లోనే బుక్ చెయ్యమను” అన్నారు.

అమ్మయ్య వో పని అయింది అనుకుంటూ వెంటనే వార్తాహరి లాగా శ్యామల గారికి చెప్పి వచ్చాను.

ఉత్సహంగా చకచకా పనులన్నీ చేస్తున్నాను. అది చూసి ఈయన ఒకటే ఆట పట్టిస్తున్నారు. అంటే మనసు లో ఎక్కడో టికెట్లు దొరకవని రాక్షసానందం. దానికి విరుగుడుగా నేను చక్రం అడ్డు వేస్తూనే వున్నాను సుమా! మొత్తానికి మేము వెళ్ళే రోజు వచ్చేసింది. ఇంక చూసుకోండి హడావుడి! ట్రైన్ లోకి నేను కొంచెము పులిహోర, దద్దోజనం చేశాను. శ్యామల గారు పూరి కూర చేసారు. మొత్తము రెండు పూటలు. అసలే ఈ రైలు కుంభమేళా స్పెషల్, ఇది ఆలస్యంగా కూడా వెళుతోందని కూడా తెలిసింది. ఇంక అన్నిరకాల చిరుతిళ్ళు కూడా కొని పెట్టుకొన్నాము. పాపం కృష్ణమూర్తిగారికి ఎదటి వాళ్ళు చెప్పేది తొందరగా వినపడదు. అడిగినదే మళ్ళీ మళ్ళీ అడుగుతారు. స్టేషన్ కి ఒక గంటముందే వెళ్లి కూచున్నాము. అప్పుడు చూసుకొంటే తెలిసింది మేము వెళ్ళేది ఎసి లో కాదు మామూలు స్లీపర్ క్లాసు లో అని. ఇంక మా వారు అయితే నరసింహావతారం ఎత్తేసారు. పాపం కృష్ణమూర్తి గారు “ఇలా జరగుతుందని అనుకోలేదు రామంగారు. ఆ ట్రావెల్ ఏజెంట్ కి ఫోన్ చేస్తే వాడు సొంత పైత్యంతో ఎసి లేకపోయినా, స్లీపర్ లో కన్ఫర్మ్డ్ సీట్స్ వున్నాయని చేసాడుట” అని ఎంతో నొచ్చుకుంటూ చెప్పారు. నా వైపు కోపంగా చూసి గంటుపెట్టుకొన్న మొహంతో ఈయన రైలెక్కారు. రైలు ఎక్కినప్పటినుంచి కృష్ణమూర్తి గారికి తెగ ఫోన్లు, ఈయనకి వినపడక గట్టిగ మాట్లాడటం, అది చూసి మా వారు గొణుక్కోవడం “ఈ చెవిటి మనిషికి అన్ని ఫోన్లు రావడం ఏమిటో? వస్తేవచ్చాయి కాస్త నెమ్మదిగా

మాట్లాడుకోవచ్చు కదా" అని తెగ విసుక్కు పోతున్నారు. కృష్ణమూర్తి గారు భజన చేస్తూ ఎంతో భక్తిపారవశ్యం లో మునిగిపోయారు. ఆయన చుట్టూ కొంత మంది కూచుని భాష తెలియక పోయినా తలూపుతున్నారు. రాత్రికి తెచ్చుకున్న పూరీలు తినేసి నిద్రకి ఉపక్రమించాము. ఉదయాన్నే నిద్ర లేచి చూద్దుము కదా! బెర్త్ నుంచి కాలు కదపలేని స్థితి. ఎక్కడచూసినా జనమే, విసుక్కొంటు టాయిలెట్ వైపుకి వెళ్లారు. నేను కూడా ఎలాగో వాళ్ళని తప్పించుకొని టాయిలెట్ కి వెళ్లి రావడం పెద్ద అడ్వెంచర్ చేసినట్లయింది. మా వారి కళ్ళలో, కోపం, అసహనం ఏ క్షణాన అయినా కట్టలు తెచ్చుకోనేలావుంది. "అందుకే ఎసి లో వెళ్దామని అన్నాను" అంటూ మళ్ళీ మొదలుపెట్టారు.

మొత్తానికి మేము అలహాబాదు చేరేసరికి ఇంచుమించుగా మధ్యాన్నం 12 గంటలైంది. స్టేషన్ కి ఈయనకి తెలిసున్న వాళ్ళు ఒక మనిషిని పంపిచారు. త్రివేణి సంగమం కి తిన్నగా వెళ్ళిపోదామని అన్నాడు అతను. మేము కూడాసరే అని అతనితో బయల్దేరి, ఆ రేవుకి చేరుకున్నాము. అక్కడ పడవ నడిపే కుర్రాళ్ళు చాలా స్పీడ్ గా 'సంగమం'కి తీసుకొని వెళ్లారు. మా వారికి నీళ్ళు అంటే భయం. అందుకే ఏమి మాట్లాడకుండా బిక్క మొహం వేసుకొని కూర్చొన్నారు. చక్కగా గంగపూజ చేసుకొని నది మధ్యలోకి వెళ్లి, ఒక్కొకళ్ళ పేరు చెప్పి బోలెడు మునకలు మునిగాను. ఆయన మాత్రం ఎలాగో మూడు మునకలు మునికేసి అది కుడా నన్ను పట్టుకొని, వెంటనే పడవ ఎక్కి నిలబడ్డారు. వస్తున్న నవ్వుని బిగ పెట్టాను... లేకపోతే ఇంకా ఉడుక్కుంటారు. మా తిరుగు రైలు రేపు రాత్రి పది గంటలకి. అంటే ఇంచుమించుగా రేపు సాయంత్రం వరకు ఈ అలహాబాదు లోనే ఉంటాము.

మరునాడు తెల్లవారుఝామునే లేచి 2.30 గంటలకి బయలుదేరి ఘాట్ దగ్గరకి ముందేచెప్పివుంచుకొన్న ఆటోలో నలుగురం బయలుదేరాము. డ్రైవర్స్ పక్కన కృష్ణమూర్తి గారు కూచున్నారు. అక్కడ ఒక చోటుకి వెళ్ళాక ఏదో సివిల్ లైన్స్ అన్నాడు. అక్కడనుంచి దగ్గరే, వో 2 కి.మి ఉంటుందని చెప్పి దింపేసాడు. అలా అక్కడ మా నడక మొదలైంది. యెంత దూరం నడిచినా ఘాట్ కనిపిస్తేనా? కాని ఎక్కడపడితే అక్కడ డైరక్షన్స్ వుండటంతో అవి చదువుకొంటూ మధ్యమధ్యలో మా శ్రీవారి చూపుల బాణాలకి తట్టుకొంటు నిజంగా వాటికే కనక శక్తివుంటే అక్కడికక్కడే నేనుమాడి మసైపోయేదాన్ని. రెండు మూడుచోట్ల ఆగి వేడివేడి టీ తాగి శక్తి పుంజుకొంటూ నడుస్తున్నాము. ఎక్కడ చూసినా జనం! జనం పుట్టలు పుట్టలుగా అలా ఆ జనప్రవాహంలోపడి కొట్టుకు పోతూ ఇంకొక నాలుగు గంటలు నడిచాక ఘాట్ కి చేరుకొన్నాము.

అమ్మయ్యా! బతుకు జీవుడా అనుకొంటూ స్నానాలు కానిచ్చిబయలుదేరాము. ఈ లోపల కృష్ణమూర్తి గారు వచ్చిఇక్కడ దగ్గరలోనే శక్తిపీఠం వుంది అదిచూసుకొని వెళ్దాము అన్నారు. కాని అప్పటికే శ్రీవారు కోపంతో ఆకలితో మండిపోతున్నారు. ఇంక ఆ గుడికి వెళ్లడమా? ఇంకేమన్నా వుందా? ఇంతలో దేవుడులా అక్కడ ఒక పోలీస్ చెప్పాడు, ఆగుడికి వెళ్ళేదారి క్లోజ్ చేశారు అని. అమ్మయ్య అనుకొన్నాను. ఇంక అక్కడనుంచి స్టేషన్ కి వెళ్ళడానికి మాపాట్లు చూడాలి కొంత దూరము రిక్షాలోవెళ్లి అక్కడనుంచి మళ్ళీ నడిచి వెళ్లేసరికి అందరికాళ్ళు రోళ్ళులా తయారయ్యాయి. అందరం కూడా అలవాటు లేనినడకతో అలసిపోయాము. నేను అసలు మావారివైపు చూడకుండా శ్యామలగారి వెంటే వున్నాను. నా లోంచి నాఅంతరాత్మ నన్ను ఇలాతిట్టిపోస్తోంది". ముందువుందే ముసళ్ళపండగ రాజ్యలక్ష్మి! ఆయను ఎలాగు దూర్వాస రూపం ఎత్తుతారు అది తప్పదు ఆ కోపాగ్నికి నీ పని సరి. నువ్వు, నీ కుంభ మేళా యాత్ర అనవసరంగ వచ్చావుకదే! అసలు నీకు ఈబుద్ధి

ఎందుకుపుట్టిందే, పుట్టినది పో, నీవేల శ్రీవారిని అడుగువలె, అడిగితివి పో, నీఎదుటవారిని ఎందుకుపిలువవలె? అనుభవించు".

మేము స్టేషన్ కి వెళ్లేసరికి మధ్యాన్నం 3 గంటలు అయింది. "బోలెడు టైం వుంది కదా నేను వో గంట యోగ చేసుకొంటాను" అని కృష్ణమూర్తి గారు ఓ పక్కకి వెళ్లి అక్కడ ఎవరో పడుకొంటే, వాళ్ళను పక్కకు జరగమని చెప్పి ఎంచెక్కా ఆసనాలు వేసుకుంటున్నారు. బోలెడు మంది ఆయన చుట్టురా చేరి వాటిగురుంచి అడుగుతున్నారు. అప్పుడే ఆయన వాళ్ళకి 'ఇన్స్టంట్ గురువు' కూడా అయిపోయారు. ఇంక మా వారి అవస్థ చూడాలి, అసలే చిరాకు మనిషి, "ఈ కృష్ణమూర్తికి అస్సలు తెలివి వుందా ఎక్కడ పడితే అక్కడ చేస్తారా?" అంటూ తెగ ఫీల్ అయిపోతున్నారు. మొత్తానికి, ఆరుద్రగారన్నట్లు జీవితకాలం కాదు కాని మారైలు ఓ గంట లేటుగా వచ్చింది. హాయ్ గా ఎసి లోకి ఎక్కి శుభ్రంగా గుర్రుకొట్టి నిద్రపోయారు మావారు. మేము కూడా అందరం ఒళ్లెరగకుండా పడుకొన్నాము.

రైలు మా ఊరు చేరుకొన్నాక స్టేషన్ లో దిగేసరికి కృష్ణమూర్తి గారి అబ్బాయి అందరికి మెళ్ళో పూలదండలు వేసి కాళ్ళకు నమస్కారం చేసాడు. 'భళా భళా! జయహో మాకుంభమేళా యాత్రా' అని అంటూ మావారు "కృష్ణమూర్తి గారు! వచ్చే ఏడాది అర్ధకుంభమేళ కదా! ఉజ్జయిని లోనూ, నాసిక్ లోనూ. మనం మళ్ళీ కలిసి వెళ్దాము ఇప్పటినుంచే ఏర్పాట్లు చెయ్యండి" అన్నారు.

"హ" అంటూ నేను ఉలుకు పలుకు లేకుండా, ఆయన వైపు చూస్తూ అలా ఉండిపోయాను. ఇది కలా! నిజమా! "రాజి వున్నావా? పోయావా? అనందం తట్టుకోలేక షాక్ లో వున్నట్టుంది" అన్న శ్రీవారి మాటలు లీలగా వినిపించాయి.

************




"మాణిక్య రావు మారుతి కారుకొన్నాట్ట!"

"ఇదెలా సంభవం?!" " ఏమో నేను విన్నమాట మాత్రం నిజం!" “వెళ్ళి చూద్దాం పదండి" కాలనీ కాలనీ అంతా బిలబిల మంటూ బయల్దేరి మాణిక్యరావు ఇంటి ముందు గుమికూడారు. పైవాళ్ళకు 'ఏం జరిగిందో ఏమో! పాపం జరగరానిదేమై నానా! ఇలా గుంపులు గుంపులుగా వెళూతున్నారు!' అనే అనుమానం రావచ్చుగాక, నిజానికి వీళ్ళంతా తరలి రావటం మాత్రం యదార్థం. మాణిక్యరావు మారుతీ కారు కొన్నాడా? లేక ఉత్తి పుకారా? అని తెల్సుకోనే! నిజం. మాణిక్యరావు మారుతీ కారు కొన్న మాట ముమ్మాటికీ నిజం. తళతళామెర్సిపోయే టమోటా రంగు మారుతీ కారు మాణిక్యరావు ఇంటిముందు నిల్చి ఉంది, మహారాణిలా! అంతా వచ్చి షేక్ హ్యాండ్స్ తో మాణిక్యరావు చేతిని ఊపి ఊపి వదిలారు. (పాపం ఆరాత్రి మాణిక్యరావు సతీమణీ సరస్వతి అమృతాంజనం రాసి కాపడం పెట్టిందిలేండి.) మాణిక్య రావు వచ్చిన వారిని ఊరికే పంపుతాడా! అదివాడి 'శబ్దమంజరి'లో లేనే లేదు (డిక్షనరీకి తెలుగుపదం లెండి). పాపం సరస్వతి అందరికీ నాల్గు లీటర్ల పాలతో టీ, మూడు కేజిల ఉప్మా, జీడిపప్పు మరికాస్త వేసి నిమ్మకాయ పిండి మరీ అందించింది. మధ్యాహ్నం దాకానూ.

మా మాణిక్యరావు ఉత్త బోళా మనిషి. ఎవరైనా కానీండి "మీరెంత మంచివారండీ! చేతికి ఎముకే లేదుట కదండీ! అబ్బో చాలా గొప్పవారుట కదండీ విన్నాను.!" అనిపొగిడితే చాలు మేరుపర్వతమెక్కి పోతాడు. శంకరునిలా పొంగిపోతాడు, భస్మా సురునికి వరాలిచ్చినట్లు ఇట్టే ఇచ్చేస్తాడు! ఏదో ఒకపాటి కాస్త పెద్ద ఉద్యోగమే గవర్నమెంటు ఆఫీసులో వెలగబెట్టాడులెండి! ఐతే కానీ ముట్టిన పాపాన పోకపోగా ఎవరైనా వచ్చిపొగిడితే చాలు జేబులు ఖాళీ చేసేసుకుని వారిపని చక్కబెట్టి సకల మర్యాదలూ చేసి పంపేవాడు. అంతా ముఖాన పొగిడి, పనులు చేయించుకుని చాటుకెళ్ళి జోకు లేసుకుని నవ్వుకునేవారు. పాపం ఇవేవీ మా మాణిక్యరావుకు పట్టవు, తెలివుకూడా.

వాడి సతీమణి సరస్వతి మహాఇల్లాలు. కొన్నేళ్ళు చూసి చూసి వీడిహ మారడని నిక్కచ్చి చేసుకుని, బి.ఏ. చదివింది కనుక, లెక్కలు బోధించడంలో దిట్ట కూడా కనుక ఇంటి పక్కనుండే ఖాళీ జాగాలో ఓపాక వేయించి అక్కడ గోడకు ఒక బోర్డూనూ వేయించుకుని గణిత ట్యూషన్స్ చెప్పసాగింది.

"అన్నయ్యా! నేనిలా చేయదలచాను, తప్పేం లేదుగా, ఈయనిహ మారరు. పిల్లలకు కాస్తంత చదువు చెప్పించుకోవాలనే ధ్యాసైనా లేదాయె! జీతంలో సగం ఇలా అర్హత లేని వారిమాటలు నమ్మి అపాత్రదానం చేస్తున్నా రాయె! ఇంటికి తెచ్చే సొమ్ము ఇంటిఖర్చులకే చాలకుండాఉంది. ఏంచేయను చెప్పండి!" అంటూ నాముందు తన బాధ వెళ్ళబోసుకుని, ఝాన్సీ రాణిలా రంగంలోకి దిగింది. క్రమంగా అదో బడిలా పెరిగి, పేరూ పెరిగి ఆమెవద్ద లెక్కల ట్యూషన్ ఒక వరంలా భావించి తల్లి దండ్రులు లైన్ కట్టే సేవారు. ఐతే సరస్వతి పేదవారైన తెలివైన పిల్లలకు ఉచితంగానే గణితబోధన చేసేది. తాను కష్టపడి అలా సంపాదించిన ఆ సొమ్మంతా జాగ్రత్త చేసి కొడుకులిద్దర్నీ చదివించింది. వారి చదువులకంతా ఆమె సొమ్మే ఖర్చుపెట్టింది. కొడుకులిద్దరూ తల్లిపడే అవస్థ చూసి, జాగ్రత్తగా చదివి స్కాలర్ షిప్పులతో ఒకడు డాక్టర్ కాగా మరొకడు ఇంజనీరై మంచి ఉద్యోగాల్లో కుదురుకుని, బుద్ధిగా తల్లి విచారించి చేసిన సంబంధాలు చేసుకుని అమెరికా వెళ్ళిపోయారు. మాణిక్యరావు రిటైర్మెంట్ కాగానే తమతో ఉండేందుకు అమెరికా రమ్మని కోరగా, భార్యతోపాటుగా ఒక్కమారు వెళ్ళి ఆరునెల్లకు బదులుగా లక్షా నలభై వేలు ఖర్చుచేయించి ఆరువారాల్లో తిరిగి వచ్చేసాడు!. అక్కడ తాను సాయం చేయను ఎవ్వరూ లేరుట! ఊరికే కూర్చోలేడుట! ఇతరులకు సాయం చేయకుండా తాను ఉండలేడుట! ఎవరైనా వింటే నవ్విపోతారు! ఐనా ఏమీ చేయలేక సరస్వతి కూడా భర్తతో తిగిరి వచ్చింది, ఆవయస్సులో ఆయన్ని ఒంటరిగా వదలి ఉండలేక.

బాగా కాళ్ళనెప్పులతో బాధ పడుతున్న తల్లిని చూసిన పిల్లలిద్దరూ వచ్చేప్పుడు తల్లి అకౌంట్ లోకి ఐదు లక్షలు ఆన్ లైన్లో జమచేసి "అమ్మా! కష్ట పడ్డన్ని నాళ్ళూ పడ్డావు, ఇహ హాయిగా విశ్రాంతి గాఉండు . ఒక కొత్త కారు కొనుక్కుని నడవ కుండా తిరుగు, ఎటూ మీ ఇద్దరికీ కారు డ్రైవింగ్ లైసెన్స్ ఉంది కదా!" అనిచెప్పారు.

స్వదేశానికి రాగానే జట్ ల్యాక్ పోయాక భార్యను వెంటేసుకుని మాణిక్యరావు బయల్దేరుతుండగా ఎదురైన ఏకాంబరం, "ఏమండోయ్! మాణిక్యరావుగారూ! ఎక్కడికో బయల్దేరారే!" అంటూ పలకరించాడు. 'శుభమాని కారు చూడను వెళుతుంటే

ఈయన ఎదురై ఎక్కడి కని అడుగుతున్నాడేంటా!' అని అనుకుంది సరస్వతి. మన మాణిక్య రావు దాపరికం లేనివాడు కదా! “ఔనండీ! మాపిల్లలు కారు కొనుక్కోమని డబ్బిచ్చారు, అందుకే కార్లు చూడను వెళుతున్నాం." అని చెప్పనే చెప్పేశాడు. ఏకాంబరం మేం తక్కువ వాడు కాదుగా! అందర్నీ బుట్టలో వేసుకుని సొమ్ము చేసుకోడమే ఆయన దళారీపని.

"ఓరినీ! చెప్పకనే పోతివి! కొత్త కార్లెందుకోయ్! సెకండ్ హేండ్ కొను!, డబ్బుకు డబ్బూ సేవవుతుంది. మిగిలిన సొమ్ముతో నీవు అనేక మందికి సహాయమూ చేయొచ్చు. ఏమంటావ్? నాఎరికలో ఇటీవలే మారుతీ కారు కొనుక్కుని, కొడుకు దగ్గరికి బెంగుళూరు వెళ్ళిపోతూ, తనకారు అమ్మేస్తాననీ ఎరుగున్నవారి కెవరికైనా చెప్పమనీ పోరు తున్నాడయ్యా మాస్నేహితుడు ఒకడు.! ఏమంటావ్? ఎలాగూ బయల్దేరారుగా! రండివెళదాం" అంటూ మరుమాట్లాడ నివ్వకుండా, ఆటోఎక్కించి తీసుకెళ్ళి కారు చూపాడు. బయటికి 'టమోటా' రంగులో మెర్సిపోతూ ఉంది. రంగు చూసి మురిసిన మాణిక్యరావు, కనీసం పక్క నే ఉన్న భార్యతో ఒక్క మాటైనా అనకుండానే "బావుందండీ రంగు! వెలచెప్తారా?" అనేశాడు.

భార్య "ఏమండీ! పిల్లలు కొత్తకారు కొనుక్కోమన్నారు కదా! పాత దెందుకండీ! పైగా ట్రయల్ డ్రైవ్ చూడకుండానే నా!" అంటూనే ఉంది ఉండబట్టలేక.

"ఉండు సరసూ! ఏకాంబరం గారు చెప్తున్నారుగా? ఇటీవలే కొన్నారని, సొమ్ము మిగిలితే అవసరాలకు ఉంటుందిగా!" అంటూ "వెలకుదర్చండి మరి" అననే అన్నాడు. ఏకాంబరం ఓనర్ని చాటుగా తీసుకెళ్ళి మాట్లాడి "మాణిక్యం గారూ ! మీరు గనుక కొత్త కారు కొంటే అనవసరంగా షుమారుగా ఐదులక్షలు ఖర్చుచేయాల్సు ఉంటుంది, అదే ఈ కారైతే మీకు మూడు లక్షలకే వస్తుంది, రెండులక్షలు మీ బ్యాంక్ అకౌంట్లో ఉంటాయి, వడ్డీలో పిల్లలు పెడుతూనే ఉంటుంది. ఏమంటారు?" అని ఆలోచించుకునే వ్యవధానం కూడా ఇవ్వకుండా తొందరచేశాడు. "పిల్లలతో ఒకమాట చెప్పికొందామండీ!" అంటున్న సరస్వతిని, "మీరు మీపిల్లలతో మాట్లాడాలంటే ఇప్పుడు, వారికి అర్ధరాత్రపుడు ఫోన్ చేస్తే ఏమైందో, ఏమో అని వారు కంగారుపడతారు, రేపటివరకూ ఈకారు ఉండదు. అదుగో ఎవరో వస్తున్నట్లు ఫోన్ కూడా వచ్చిందిట! అందుకే కారు బయటే ఉంచాట్ట! ఏదో నేను రెకమెండ్ చేస్తున్నానని మీకివ్వను అంగీకరించాడు ఈ ఆనందరావ్, ఆపైన మీ ఇష్టం" అనేశాడు ఏకాంబరం.

ఇహ ఒక్క నిముషంకూడా ఆలస్యంచేయక, కనీసం కారుట్రయల్ డ్రైవ్ చేసి కూడా చూడక జేబులోంచి చెక్ బుక్ తీసి చెక్కురాసి ఇచ్చేశాడు మూడులక్షలకూ! తనమాట ఎటూ చెల్లదని సరస్వతి మౌనంగా ఉండిపోయింది. కారు తాళాలు చేతికిచ్చి "ఇదుగోనోయ్! ఇప్పట్నుంచి ఇది మాణిక్యరావుగారికారు." అంటూ ఏదీ నన్ను అలా మార్కెట్ వరకూ దింపి ట్రైల్ వేసుకో, ఆపైన ఆలయాని కెళ్ళి పూజచేయించి ఇంటికి తీసుకెళ్ళు అంటూ కారెక్కి కూర్చున్నాడు ఏకాంబరం. కారెక్కి డ్రైవ్ చేస్తూ మహా ఆనందపడిపోయాడు మాణిక్యరావు. అదోండి అలా మాణిక్య రావు సెకండ్ హ్యాండ్ మారుతీకారు ఓనరైపోయి కాలనీ అంతా కాఫీ ఫలహారాలు పందేరం చేశాడు.

ఆ మర్నాటినుంచే అసలుకథ మొదలైంది. ఉదయాన్నే ఇంకా మాణిక్యరావు బ్రేక్ ఫాస్టైనా కానివ్వందే "ఏమండీ! మాణిక్య రావుగారూ! మావాడి కిరోజు ఎంసెట్ ఎగ్జాం! మీలాంటి మంచిమనిషి, సహృదయులూ డ్రాప్ చేస్తే వాడికితప్పక సీట్ వచ్చితీరుతుంది. కాస్తంత డ్రాప్ చేయరూ!" అంటూ వచ్చాడు పక్కింటి పరంధామయ్య!. భార్య ఇడ్లీ తినమంటున్నా వినిపించుకోక "ఉండవే పాపం! మన పిల్లల్లా అందరూ పైకి రావద్దూ! పాపం పెద్దమనిషి అంతలా అడుగుతుంటే, ఇప్పుడే వస్తాగా!" అంటూ కారుతాళాలు తీసుకు వెళ్ళాడు. అలా పరంధామయ్య గారి అబ్బాయిని పరీక్ష సెంటర్లో డ్రాప్ చేసి, పరం ధామయ్యను అతగాడి ఆఫీసులో డ్రాప్ చేసి, పదకొండయ్యాక వస్తుంటే అదే కాలనికి చెందిన కామేశ్వర్రావ్ కనిపించి, ఆర్టీసి ఎర్ర బస్ కోసం ఎత్తినట్లు చేయిఎత్తి కారాపి ,"మాణిక్యరావుగారూ! దేవుళ్ళా ఎదురయ్యారు! ఒక్క ఆటో కనిపించి చావదే! నన్నుకాస్తంత రైల్వేస్టేషన్లో దింపుదురూ! మా తాతకు ప్రమాదంగా ఉందని ఫోన్ వచ్చింది, రైల్ మిస్సైతే రేపటి వరకూ లేదు, ఈలోగా ఆయన హరీమంటే ఇబ్బందే!" అంటూ ఆయన అంగీకారంలేకుండానే డోర్ తెరిచి కారెక్కి కూర్చున్నాడు, యాడాది క్రితంపోయిన తాతను మళ్ళీ చంపుతూ...

ఆరోజు అలా అలా అందర్నీ డ్రాప్ చేస్తూ అద్దెకారు తోలుకునే డ్రైవర్లా, అద్దె లేకుండానే, తానే పెట్రోల్ కొట్టించుకుంటూ మధ్యాహ్నం రెండింటికి ఇల్లుచేరి సోఫాలో కూర్చుని సోషపోయాడు. సరస్వతి గబగబా ఇంత అన్నం మజ్జిగ కలిపి మిక్సీలో వేసి ద్రవంలా చేసి రెండు గ్లాసులు పట్టించాక పదినిముషాలకు లేచాడు మాణిక్య రావు. అలా కారుకొన్న రెండో రోజు ముగిసింది. అలా కాలనీ వాసులంతా కారు కొనుక్కోనక్కర్లేకుండా మన మాణిక్యరావు ఫ్రీగా అద్దెఖర్చు లేకుండా టౌన్ బస్సు లెక్కకుండా, ఆటో చార్జీలు మిగిలిస్తూ, కేవలం ఒక్క పొగడ్తతో రోజులు వెళ్ళదీసుకుంటూ తానేదో అందరికీ దేవుళ్ళా సాయం చేస్తూ, పరోపకారం చేస్తున్నట్లు బావిస్తుండగా, మాణిక్యరావుకు పెట్రోలు ఖర్చు రోజురోజుకూ పెరిగిపోయి బ్యాంక్ అకౌంట్ తరిగి పోసాగింది. సరస్వతిమాట చెల్లుబాటే లేదు గనుక, ఆమె ఒక చూపరిగా మిగిలిపోయింది ఏదైతే అదికానీ అని. ఒకరోజున పెట్రోలు చార్జీలు మరింతపెంచారని బస్ ఓనర్ల స్ట్రైక్ కావటంతో స్కూల్ బస్ రాలేదని కాలనీవాసుల పొగడ్తలతో పిల్లలందరినీ ఓవర్ లోడ్చేసుకుని పెద్దవారి ఒళ్ళో చిన్నవారు, ఇంకా చిన్నవారు వెనుక కారుడిక్కీలో నిల్చోబెట్టుకుని షుమారుగా పదిహేను మందిని వారివారి బళ్ళవద్ద దింపేసి వస్తుండగా, కాలనీ లోపలికి రాకుండానే మారుతీకారును గేటుముందే అటకాయించి ఆఫీసులకెళ్ళేవారంతా ట్రిప్పు లేయించుకున్నారు. చివరిట్రిప్లో మగవారు ఎక్కగా కారు ట్రబులిచ్చింది. "ఒకమారు అంతా దిగి కాస్తంత నెట్టండి, కదులుతుంది." అని మాణిక్యరావు చెప్పగానే అంతా దిగి "భలేవారే మాణిక్యరావుగారూ ! ఆఫీసులకెళ్ళేవాళ్ళం మీకారు నెడుతున్నపుడు మమ్మల్ని ఎవరైనా చూస్తే మాకు తలవంపులుగా ఉంటుంది. ఎలాగో షెడ్ కు ఫోన్ చేసి మెకానిక్ ను పిలిపించుకుని వెళ్ళండి! ఏమనుకోకండి దగ్గరేగా ఈకాస్త ఎలాగో తంటాలుపడి నడిచిపోతాంలెండి ఫరవాలేదు." అంటూ ఒక్కొక్కరూ చెక్కేశారు. ఏంచేయాలో తోచక అలా కాస్తంత సేపు కూర్చుని, చివరకు వారిసలహా పాటించి మెకానిక్ ను పిలిపించుకున్నాడు మాణిక్యరావు. 'ఇంతసేపూ ఏమయ్యాడా ఇంటికి రాలేదని' ఎదురుచూస్తున్న సరస్వతి భర్త రాగానే అడిగి విషయం తెల్సుకుని "రోజూ అంత సాయం పొందుతూ కాస్తంత కారునెట్టలేకపోయారా! వారు?" అనగానే "భలేదానివే సరస్వతీ! వారన్నట్లు పాపం వారి డ్రెస్ పాడైపోవచ్చు, లేదా ఎవరైనా కారు నెట్టడం చూస్తే వారికి చిన్నతనంగా ఉండదూ!" అనేశాడు వారితరఫునే!

కనీసం ఒక్క మారన్నా భార్యనెక్కించుకుని సినిమాకో, ఆలయానికో, షాపింగ్ కో వెళ్ళిన పాపానపోలేదు మాణిక్యరావు. అంతా

ఉచిత సేవే, సహాయమే! అదేమంటే "పోన్లేవే! పాపం అంతామనలా కారుకొనే స్థాయి ఉండద్దూ! ఏదో మనకుంది గదాని మనం గర్వపడవచ్చా! తప్పుకాదూ!" అనేశాడు ఇలా కొంతకాలం, సాగగా ఒకరోజున కారులో పిల్లల్ని వారిస్కూళ్ళ కు తరలిస్తుండగా కారు ట్రబులుచ్చింది. ఏమెకానిక్కూ మధ్యాహ్నంవరకూ దొరకలేదు. ఆవిషయం కాలనీ వాసులకు ఫోన్ చేయగా, అంతావచ్చి "ఇదేమిటండీ! ఇలా! పిల్లలకు ఈరోజు స్కూల్ పోగొట్టారూ! ఈదేం బావులేదు.! ఐనా ఇలాంటి సెకండ్ హ్యాండ్ కారుకొనుక్కోడమేంటండీ! మాణిక్యరావుగారూ! కొత్తకారుకొనుక్కోరూ ఎవరైనా! చూడండి మాకెంత ఇబ్బంది పోయిందో!" అంటూ దెబ్బలాడి, పిల్లల్ని ఆటోల్లో స్కూళ్ళకు తీసుకెళ్ళారు. అలా పదేపదే కారు ట్రబులివ్వటం, కాలనీ వాసులంతా ఇబ్బందిపడుతున్నామని బాధ వెళ్ళబోసుకోడం, వినలేక సరస్వతి "ఎందుకొచ్చిన గొడవండీ! కారుమనది షోకు వారిదా! పైగా మనవల్ల వాళ్ళేదో బాధపడుతున్నట్లు దెప్పడమేంటండీ!" అంటే, "సరసూ! మరి మధ్యలో అలా కారు ఆగిపోతే వాళ్ళ కెంత ఇబ్బందీ! అదేమనకూ అలాంటి పరిస్థితి ఎదురైతే ఏంచేస్తాం చెప్పూ!" అనేశాడు. ఒకమారు కారుషెడ్ కెళ్ళి పదిహేను రోజులు తిరిగి రాలేదు. అంతా మాణిక్యరావు ఇంటిముందు కారుందో లేదో చూసి వెళ్ళి పోసాగారు. అలా అంతా ఒక ఆదివారం వచ్చి "అదేంటండీ! మాణిక్య రావుగారూ! ఇంకా మీకారు రాలేదా! మాకెంత ఇబ్బందిగా ఉంటున్నదో చూస్తున్నారుగా! ఐనా కొత్త కారుకొనుక్కోక ఇలా సెకండ్ హ్యాండ్ కారుకొన్నారెందుకూ! కారుకొనేప్పుడు కక్కుర్తి పడకూడదండీ! దర్జాగా కొత్తదే కొనుక్కోవాలి. త్వరగా కారు తెచ్చెయ్యండి." అని ఉచిత సలహా ఇచ్చిపోయారు. మొహం గంటేసుకుని కూర్చున్న మాణిక్యరావును చూసి సరస్వతికి వచ్చేనవ్వును ఆపుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది. ఏకాంబరం కనిపించకుండా ముఖం చాటేసి తిరగటమూ ఆమె గమనించింది. ఆతర్వాత ఇహ ఇలాకాదని మార్కెట్ కు కూరలకెళూతూ ఆకారు షెడ్ కెళ్ళి "చూడబ్బాయ్!" అనగానే ఆమెకానిక్ తిరిగి చూసి,"ఓ మేండం మీరా! ఇలావచ్చారేంటండీ! రండికూర్చోండి!" అని కుర్చీ తుడిచి కూర్చోబెట్టి "మీదయవల్ల మావాడు లెక్కల్లో ఫస్ట్ వచ్చి ఇంజనీరింగ్ చదివి ఇప్పుడు మెకానికల్ ఇంజనీర్ గా జాబ్ చేస్తూ, నాకీ షెడ్ కొనిచ్చాడమ్మా! నాకొచ్చిన వృత్తి కదాఇది ఓపికున్నన్నినాళ్ళూ చేసుకుని ఆతర్వాత నాలాంటి వారికి ఉపాధిగా ఉంటుందనీ, సూపర్ వైజ్ చేసుకుంటూ బ్రతుకుదామని నడుపుతున్నానమ్మా! అంతా మీదయ. ఆరోజుల్లో నేను కారుషెడ్ లో కూలిపని చేస్తుండేవాడిని, మీకు ట్యూషన్ జీతంకూడా ఇచ్చుకోలేకపోతే మీరు ఉచితంగా చెప్పారు, గొప్పమనసమ్మా మీది!" అంటూ చేతులు జోడించాడు.

"చాలా సంతోషం, నాకోసాయం చేయాలయ్యా! మా మారుతికారు మీషెడ్ కొచ్చింది. ఆ టమోటా రంగుకారు. అది బాగవుతుందా!! మా వారు సెకండ్ హ్యాండ్ కారు కొన్నారు" అంది కారు చూపిస్తూ సరస్వతి. "అమ్మా! మీకిది ఎవరోబాగానే అంటగట్టారు, చాలా పాతది. దీని ఒరిజినల్ స్పేర్ పార్ట్స్ దొరక్కే దీన్ని ఇరవై రోజులుగా షెడ్ లోనే ఉంచేశాను. దీన్ని మీరు వచ్చినకాడికి అమ్మేయటం ఉత్తమం, ఒరిజనల్ పార్ట్స్ అన్నీ వేసి బాగుచేయను షుమారుగా ఒక లక్ష అవుతుంది, ఐనా ఈ ఇంజన్ మళ్ళా ట్రబులివ్వకమానదు." అని అన్నాడా మెకానిక్ నొచ్చుకుంటూనూ...

"మంచిది. దీన్నలాగే మరో నెలపాటు నీషెడ్ లోనే ఉంచు," ఈవిషయం మావారికి మాత్రం చెప్పకు. ఎందుకోనేను తర్వాత చెప్తాను. ఆతర్వాత ఏంచెయ్యాలో చెప్తాను." అని కూరల బుట్టతో ఇంటికేసి నడిచింది. ఈలోగా వారి కాలనీలో రోజూ మాణిక్య రావును లిఫ్ట్ అడిగే ఆనందరావు కొత్తకారు కొన్నాడు. ఐతే మాణిక్యరావులా ఎవరికీ లిఫ్టు లూ గట్రా ఇవ్వటం లేదు. పెట్రోలు పెరిగింది, నేనేం మాణిక్యరావులా పనిపాటాలేనివాడ్నికాను. నా ఆఫీసూ నాపని నాకున్నాయ్!" అనేశాడు. అంతా "నిజమేగా మరి!" అనుకుని వారివారి ప్రయత్నాల్లో వారు బళ్ళకూ గుళ్ళకూ కార్యాలయాలకూ, ఊర్లకూ వెళ్ళసాగారు.

ఒకరోజున మాణిక్యరావు బాత్ రూంలో పడి కాలు ఫ్రాక్చరైతే, సరస్వతి "ఆఫీసుకెళ్తూ, దార్లో ఉన్న హస్పటల్ వద్ద మమ్మల్ని దింపుతారా అన్నయ్యగారూ! మావారు బాత్ రూంలో పడ్డారు కాలు మెలితిరిగిపోయింది, బాధతో విల విల్లాడుతున్నారు." అని అడిగింది ఇంటికెళ్ళి ఆనందరావును. "అయ్యో! ఏమీ అనుకోకు ఈరోజు నేను అర్జంట్గా మరో ఆఫీసు కెళ్ళాలి. ఇన్స్ పెక్షన్, సమయం లేదమ్మా! మరోమారు తప్పక దింపుతాగా!" అంటూ వెళ్ళిపోయాడు. 'ఇతగాడు దింపను మరోమారు పడాలన్నమాట!' అని మనస్సులో అనుకుంటూ, ఇంటికెళ్ళి విషయం మాణిక్య రావుకు చెప్పింది. అప్పుడే మాణిక్యరావు మనోనేత్రం తెరుచుకుంది. తననింతకాలం పొగిడి పనులు చక్కబెట్టుకున్నవారంతా ఎవరో తెల్సివచ్చి జ్ఞానోదయమైంది.

***


కథల పోటీలో
రెండవ బహుమతి
రూ.2000/- పొందిన కథ

సహజాతం

డా॥పి.కె.జయలక్ష్మి

"హాయ్ రాధాంటీ ! హౌ ఆర్యూ?" అంటూ ప్రేమగా పలకరిస్తూ చనువుగా ఇంట్లోకి వచ్చాడు అరుణ్. "ఏం నాన్నా మరీ ఇర్రెగ్యులర్‌గా తయారయ్యావు? క్లాసులకి నామం పెట్టేస్తున్నావు ఫ్రీక్వెంట్‌గా...క్యా బాత్‌హై?" అన్నాను క ళ్లెగరేస్తూ. బిజీ ఆంటీ, డాడీకి ఈ మధ్య క్యాంపులు ఎక్కువై ఆరోగ్యం పాడయింది. సో, ఆఫీసు నేనే చూసుకోవాల్సి వస్తోంది. రేపట్నుంచి రెగ్యులర్లీ రెగ్యులర్. ఓకేనా? ఇంతకీ మీ రేకీ క్లాసులు ఎలా అవుతున్నాయి? నా కంప్యూటర్ క్లాసులా కాదు కదా?" అన్నాడు నవ్వుతూ.

www.gotelugu.com www.gotelugu.com www.gotelugu.com www.gotelugu.com

"నో వే, నేనేదైనా స్టార్ట్ చేస్తే అంతుచూడాల్సిందే. ఆరంభింతురు ఉత్తముల్" అంటూ మొదలుపెడితే "బాబోయ్ ఆంటీ! క్లాసు పీకకండి. వస్తా బాయ్!" అంటూ నిష్క్రమించిన అరుణ్ ని చూస్తూ ఉండిపోయాను.

నేను సైకాలజీ లెక్చరర్ గా ప్రైవేట్ కాలేజ్ లో పనిచేస్తున్నాను. మా శ్రీవారికి పబ్లిక్ సెక్టార్ లో ఉద్యోగం. పిల్లలు చిన్నక్లాసులు దాటి హైస్కూల్ కి వచ్చారు. సాయంత్రం కంప్యూటర్ క్లాసులు చెప్తూ ఉంటా. మధ్యాహ్నం రెండుకల్లా కాలేజ్ నుంచి రాగానే ఫ్రీ టైం సద్వినియోగం చేస్తూ కౌన్సిలింగ్ చేస్తూ ఉంటాను. ఇంకా రేడియో ప్రోగ్రామ్ లు, సాహితీ సమావేశాలు, అడపాదడపా సృజనాత్మక వ్యాసంగం మొదలైన వాటితో బిజీగా ఉంటాను. మధ్యలో యోగా అని, రేకీ అని చేస్తూ ఉంటా. సాయంత్రం బ్యాచ్ కంప్యూటర్ స్టూడెంట్ అరుణ్. మూడు నెలల కోర్సులో చేరాడు. నెల వరకు బానే వచ్చాడు. ఇదిగో ఈమధ్య సరిగ్గా రావట్లేదు. ఆ కుర్రవాడికి నేనంటే ఏదో అడ్మిరేషన్. "ఇన్ని పన్లు ఎలా చేస్తారాంటీ? డోంట్ యూ ఫీల్ టయార్డ్?" అంటాడు. ఎప్పుడైనా క్లాస్ అయిపోయాక నేను ఫ్రీగా ఉంటే తన ఫ్రెండ్స్ గురించి, ఫ్యూచర్ గురించి మాట్లాడుతూ ఉంటాడు. ఒక రోజు తన ప్రాక్టీస్ అయ్యాక లోపలికి వచ్చేసరికి నేనెవరికో కౌన్సిలింగ్ చేస్తూ ఉండడంతో పక్కరూంలోంచి వింటూ కూర్చున్నాడు. వాళ్ళు వెళ్ళగానే నారూంలోకి వచ్చి "వావ్ ఆంటీ ఎంత బాగా చెప్పారో. నిజంగా ఎలాంటి వాళ్ళయినా మీ మాటలు విని మారి తీరాల్సిందే. మీకింత పేషన్స్ ఎలా వచ్చింది? యూ ఆర్ రియల్లీ గ్రేట్!" అంటూ ప్రశంసల వర్షం కురిపించాడు. "నేను చదువుకున్న చదువే ఇది మరి" అని నవ్వేసాను.

ఆరు నెలలు గడిచిపోయాయి. అడపాదడపా రెండు నెలలు వచ్చిన అరుణ్ తర్వాత నుంచి అస్సలు రావడం మానేసాడు. ఆ మధ్య రెండు, మూడు సార్లు ఫోన్ చేస్తే ఫాదర్ కి బాలేదని, బొంబేలో ట్రీట్ మెంట్ అని చెప్పాడు. నేను కూడా ధైర్యం చెప్తూ జాగ్రత్తలు చెప్పాను. ఒకరోజు న్యూస్ పేపర్ లో ఆయన పోయినట్లు చూసి చాలా షాకయ్యాను. ఫోన్ చేసినా అరుణ్ నుంచి రెస్పాన్స్ లేదు. తర్వాత దాదాపు రెండునెల్లకి అరుణ్ కలిసాడు, చిక్కిపోయాడు... డిప్రెస్డ్ గా కూడా ఉన్నాడు. ఆరోజు ఆదివారం కావడంతో నేను ఇంట్లోనే ఉన్నాను, శ్రీవారు పిల్లల్ని తీసుకుని బైటకి వెళ్ళారు. ఎలా పలకరించాలో తెలియలేదు. "సారీ అరుణ్, డాడీ విషయం తెల్సి చాలా బాధపడ్డాను. మమ్మీ ఎలా ఉన్నారు? ధైర్యం చెప్పాల్సిన బాధ్యత నీదే, యూహేవ్ టు కమ్ అవుట్ ఆఫ్ ఇట్" అన్నాను లాలనగా. తల దించుకొని వుండడంతో ముఖంలోని ఫీలింగ్స్ కన్పించలేదు. "డాడీ పోయిన దానికంటే అమ్మకి అన్యాయం చేసారని నాకు బాధగా వుందాంటీ" అన్నాడు శూన్యంలోకి చూస్తూ "ఏం మాట్లాడుతున్నావు అరుణ్?" అన్నా ఆశ్చర్యంగా. "అవునాంటీ! డాడీలో మాకు తెలియని రహస్యాలుంటాయని అనుకోలేదు. ఆయన పోయాక కొన్ని విషయాలు బైటపడ్డాయి. ఎవరినో ఈమధ్యకాలంలోనే ప్రేమించారంట చూడండి ఈడైరీ. అంతా ఆమె గురించే "దనూ"ట! అమ్మని ప్రేమించి పెళ్లి చేసుకుని...? ఎలా సాధ్యం ఆంటీ... ఇంకొకళ్ళని ప్రేమించడం? నాకెందుకో ఆయన నచ్చడం లేదాంటీ... మీరే చెప్పండి! సరే నేను మళ్ళీ కలుస్తాను. ఈ డైరీ మీ దగ్గరే ఉంచండి". అంటూ సీరియస్ గా లేచి వెళ్ళిపోయాడు.

"దనూ?!" ఆసక్తిగా, ఆశ్చర్యంగా డైరీ తెరిచాను.

2 జనవరి - యోగా క్లాసుకి చాలా కాలం తర్వాత వెళ్ళాను. ఇంకా స్టార్ట్ అవ్వలేదు పాత మిత్రులతో మాట్లాడుతూ ఉండగా

తటిల్లతలా వచ్చిన ఆమెను చూస్తూ ఉండిపోయాను. అందరిని "హలో గుడ్మార్నింగ్" అంటూ నవ్వుతూ పలకరిస్తూ నావైపు ఆశ్చర్యంగా చూసింది. ఎందుకో తనని చూస్తే ఎప్పట్నించో తెలిసిన అమ్మాయిలా అన్పించింది. నాలుగు, ఐదు రోజుల డైరీలో ఆమె వర్ణనే!

10 జనవరి - ధైర్యం చేసి నేను పలకరించాను తనూ మాట్లాడింది. ఎప్పుడైనా క్లాసుకి ముందు వస్తే జనరల్ విషయాలు, పిల్లలు చదువులు ఏవో మాట్లాడుకునే వాళ్ళం ఆరోగ్యరీత్యా యోగాలో చేరినా ఎందుకో రెగ్యులర్ గా వెళ్ళలేకపోతున్నాను. చాలా ఆలస్యంగా పడుకోవడం వర్క్ టెన్షన్స్, క్యాంపులు, నాజీవిత విధానం, అలవాట్లు కారణంగా! కాని తనని కలిసాక తనని చూడడానికి, మాట్లాడ్డం కోసమైనా రోజూ వెళ్ళాలన్పించేది. కాని మనసు మాట శరీరం వినాలి కదా!

ఇంకో పేజిలో... తనకి ప్రేమతో "దనూ" అని పెట్టుకున్నాను. వెన్నెల పారిజాతంలా ఉంటుందామె. దేవుడి ఫోటో దగ్గర పారిజాతాలు ఉంచి అగరుబత్తి వెలిగిస్తున్న ఆమె ముఖంలో ప్రశాంతత నాకు ఎంతో అద్భుతంగా అన్పించింది. ఇంకో చోట... ఇవాళ మా ఆఫీస్ కి వచ్చింది. తనేదో ప్రాజెక్ట్ చేస్తోందట. నేను సర్టిపై చేయాలట. చాలాసేపు మాట్లాడకుండా ఉండిపోయాం. వెళ్ళిపోతుంటే తెలియని బాధ ఆవరించింది. నాబలాలు, బలహీనతలు, బాల్యం, అలవాట్లు అన్నీ తనకి చెప్పుకున్నాను. నా జీవితంలో తనో అందమైన పార్శ్వం. మాటల్లో సౌమ్యత, ముఖంలో చిరునవ్వు, కళ్ళల్లో ప్రశాంతత... ఆమె నాకు ఎంతో ఆకర్షణీయంగా అన్పిస్తుంది. తను ఎప్పుడైనా ఫోన్ చేస్తే నాకెంతో ఉత్సాహంగా అన్పిస్తుంది. మా ఇద్దరి మధ్య ఎప్పట్నించో ఏదో బంధం ఉన్న ఫీలింగ్. అతిగా మాట్లాడదు, ఏం చెప్తున్నా ఇష్టంగా వింటుంది. మనసు వెలితిగా ఫీలయినా, టెన్షన్ గా అన్పించినా తనతో మాట్లాడాలని పదేపదే అన్పిస్తుంది. ఎందుకనో?

జూన్ 12 ఈ మధ్య చాలా కాలంగా యోగాకి వెళ్ళడం కుదరడం లేదు మధ్యలో ఫోన్ చేస్తూ దనూతో మాట్లాడ్డం మాత్రం మానలేదు. ఒకసారి తను ఏదో పనిమీద ఆఫీస్ కి వచ్చిందట. కాని నేను లేను. తెలిసాక బాధపడ్డాను. ఎందుకిలా అవుతోంది? నాకు తనంటే ఎందుకంత ఇష్టం? ఫోన్ చేసినప్పుడల్లా ఏదో విధంగా తన పట్ల నా ఫీలింగ్స్ వ్యక్తం చేసేస్తూ ఉంటాను. ఏమన్పిస్తుందో కూడా మొహమాటం లేకుండా చెప్పేసినా తన నుంచి ఏ స్పందనా ఉండదు. టాపిక్ తెలివిగా మార్చేస్తుంది. ఆమె చమత్కారపు మాటలు, భావుకత, ప్రశాంతత, చైతన్యం, అందరితో మాట్లాడే తీరు నాకు ఎంతో ముచ్చటగా అన్పిస్తుంది. ప్రశంసించినా నవ్వేసి ఊరుకుంటుంది. ఒకసారి మాటల్లో తన టాలెంట్స్ కి, ఎదుగుదలకి భర్తే కారణమని చెప్పింది. కొంచెం ఈర్ష్యనిపించినా సంతోషం వ్యక్తం చేశాను. ఎందుకంటే నేనెన్ని సార్లు నా మగతనం నిరూపించుకున్నా నా భార్య ఎప్పుడు నన్ను ప్రశంసించలేదు. కాని ఇంకా ఏవో అమర్చి పెట్టలేదని నన్ను నిరుత్సాహ పరుస్తుంది. ఎప్పుడూ అసంతృప్తే..! ఆ కోణంలో ఆమె భర్త ఎంత అదృష్టవంతుడు అనుకున్నా.

1. ఆగష్టు - ధనూని చూడాలని వుంది కాని ఆరోగ్యం సహకరించడం లేదు డాక్టర్లు టెస్ట్ లు అంటున్నారు. తను ఈమధ్య ఫోన్ చేసినా నేను రెస్పాండ్ కాలేకపోతున్నాను. ఏమనుకుంటుందో? దనూ చాలాసార్లు చెప్పింది. "శ్రీకర! సిగరెట్స్, ఆల్కహాల్

మానేయండి" అని! ఏంటో ఎడిక్ట్ అయిపోయాను. ధనూ నా జీవితంలో ఇంకొంచెం ముందు ప్రవేశించి ఉంటే తనమాట వినేవాణ్ని...? ఏమో? తను ఏం చెప్పినా "నో" అనాలనిపించదు. ఒకసారి తనేమందో తెల్సా "శ్రీకర్ సిగరెట్ కాల్చాలనిపించినపుడల్లా మీకు ప్రియమైన వారితో మాట్లాడండి" అని. నాకు ప్రియమైన వాళ్ళెవరో తనకి తెలియదా..? ఆశ్చర్యం! మా ఇద్దరికీ ఏరకమైన వారధులు లేవు. ఎవరి నుంచి ఎవరికీ ఏ ఆబ్లిగేషన్స్ లేవు. కాని తనంటే నాకు చెప్పలేని 'ఇది'... ఇలా సాగిపోయింది డైరీ అంతా!

భారంగా నిట్టూర్చాను. ఒక నిర్ణయానికి వచ్చి అరుణ్ కి వీలయినపుడు రమ్మని ఫోన్ చేసాను. నాలుగు రోజుల తర్వాత మధ్యాహ్నం మూడు అవుతుంటే వచ్చాడు. అరుణ్. "దా అరుణ్, భోజనం చేసావా? లైమ్ జ్యూస్ తీసుకో" అంటూ రెండు గ్లాసులతో పట్టుకొచ్చి డ్రాయింగ్ రూంలో కూచున్నాము. "డైరీ చదివారా రాధాంటీ! ఇప్పుడు మీరే చెప్పండి మా డాడీ అలా చేయచ్చా?" సూటిగా అడిగాడు. "అరుణ్ మీ డాడీ విషయం పక్కన పెట్టు. నీకో విషయం తెలుసా? ఆకర్షణ, అభిమానం, ప్రేమ, కన్ సర్న్, జాలి, దయ ఇవన్నీ మనిషిలో ఉండే సహజాతాలు. కారణం తెలియకుండానే కొందరి మీద అభిమానం, మరికొందరి మీద ద్వేషం, చికాకు కల్గుతాయి. ఎందుకంటే చప్పలేం. కొందరు తమలో లేని వైఖరి ఇతరుల్లో కన్పిస్తే ఆకర్షింపబడతారు. నా ఉద్దేశ్యం మీ డాడీ ది రిజర్వ్ డే నేచర్. బహుశా ఆయనకి కలివిడి తనంగా ఉంటే నచ్చుతుందేమో!" సాలోచనగా ప్రశించాను.

"అవునాంటీ, డాడీ చాలా తక్కువగా మాట్లాడతారు. అలాగే నవ్వడం కూడా తక్కువే. అందుకే నాకు ఆశ్చర్యమన్పించింది ఇది చదువుతుంటే! అయినా ఆంటీ ఆయనేమైనా టీనేజరా నాఅంత కొడుకుని పెట్టుకుని? మా అమ్మకి తెలిస్తే ఎంత బాధపడుతుంది? అమ్మలో కూడా ఇంచుమించు ఆ ధనూ గుణాలన్నీ వున్నాయి కదా" అన్నాడు కించిత్ కినుకగా. అరుణ్ మాటలకి నాకు నవ్వొచ్చింది. "చూడు నాన్నా. తల్లి ఎలావున్నా పిల్లలకి ఆమె చాలా నచ్చుతుంది. కాని భర్తకి అన్ని యాస్పెక్ట్స్ లో భార్య నచ్చాలని లేదు. అలాగే భార్యకి కూడా భర్త! ఇకపోతే టీనేజరా అన్నావు? మనిషి మనసు ఎప్పుడు ఎవరి పట్ల ఎలా స్పందిస్తుందో ఎవరం చెప్పలేం! కొంతమంది బైటకి వ్యక్తం చేయకుండా మనసులో ఊహించుకుంటూ ఉంటారు. సమాజం, పరువు, ప్రతిష్ట ఎన్నో కారణాల వల్ల! మీ అమ్మగారి కంటే ధనూ బాగుండకపోవచ్చు. కాని కేవలం అందమే ఇక్కడ ప్రాధాన్యం కాదు. కొంతమంది నవ్వు, నడత, అవతలి వారిపట్ల కనపరిచే గౌరవం, కన్ సర్న్, సరదాగా నవ్విస్తూ మాట్లాడే విధానం, కలుపుగోరుతనం, హావభావాలు ఏదైనా మనసుకి నచ్చవచ్చు. దాని గురించి అవతలి వాళ్ళు వివాహితులా అవివాహితులా, వయసులో ఉన్నారా, ముసలి వాళ్ళా అని ఆలోచించే పనిలేదు. కొంతమంది ఏమాత్రం అందంగా లేకపోయినా కేవలం మాట తీరుతో అందర్నీ ఆకర్షించుకుంటారు...

బహుశా మీనాన్నగారికి ఫ్రెండ్స్ పరిమితమై వుండచ్చు. ఇంట్లో మీ మమ్మీతో ఆయన వేవ్ లెంగ్త్ కుదరకపోయి వుండవచ్చు. ఆయన కోరుకున్న అంశాలు, లక్షణాలు ధనూలో కన్పించడంతో స్నేహం చేసి వుండవచ్చు. అదే ధనూ మగవాడయితే నీకు బాధన్పించేది కాదేమో. ఇదే మన సమాజం చేసుకున్న దౌర్భాగ్యం. అపోజిట్ సెక్స్ తో స్నేహంగా ఉంటే, వాళ్ళు పరిధుల్లోనే ఉన్నా అనుమానంగా చూసి అభాండాలు వేస్తారు. మీ డాడీ ఏమీ లిమిట్స్ దాటలేదు కదా! కేవలం తన భావాల్ని, ఆలోచనల్ని అపురూపంగా డైరీలో వ్రాసుకున్నాడు. ప్రతి మనిషికి హృదయంలో సీక్రెట్ కార్నర్స్ ఉంటాయి. ఇది సైకాలజీ చెప్పే నిజం.

అన్నిటినీ అందరితో పంచుకోలేరు! వాళ్ళ మనసే వాళ్ళకి అంతరంగిక నేస్తం. స్వంతవాళ్ళకి చెప్పినా కొన్నిటిని ఎవరూ ఆమోదించలేరు. ఆమోదించకూడదు కూడా!...

... ఫీలింగ్స్ అనేవి నేచురల్ ఇన్ స్టింక్ట్స్. ఎవ్వరం నియంత్రించుకోలేనివి. అయినా నీకో విషయం చెప్పనా ఆశ్చర్యపడనంటే?" నా మాటల ప్రభావం తన మీద చాలా బాగా కన్పిస్తోంటే అడిగాను సడన్ గా. "ఏంటాంటీ?" ఉత్సుకతగా అడిగాడు అరుణ్. "ధనూ అంటే ధనశ్రీ. తను నాకు బాగా దగ్గర బంధువు. హార్ట్ లో డిజార్డర్ వల్ల తను యోగాలో చేరింది. కాని తన గొప్పతనమేంటంటే తన బాధల్ని ఎవరికీ చెప్పదు. అందరి బాధలు వింటుంది. మాటసాయం చేస్తుంది. మీ డాడీకి అన్పించినవన్నీ అందరికీ తనని చూస్తే అన్పిస్తాయి. కాని అందరూ వ్యక్తం చేయరు. నాకూ తనంటే ఇష్టం. చాలామంచిది ధనూ. ఒక్కమాటలో చెప్పాలంటే తను ఎక్కడుంటే అక్కడ చైతన్యం ఉంటుంది. తనలా ఉండాలని ఎంతమంది అనుకుంటారో కాని తనే ఉండకుండా వెళ్ళిపోయింది". చివరి మాటలకి ఉలిక్కిపడ్డాడు అరుణ్. "ఏంటాంటీ మీరనేది?" అవును అరుణ్, షీ ఈజ్ నో మోర్. మీ డాడీ కంటే నెల రోజుల ముందు కార్డియాక్ అరెస్ట్ వల్ల చనిపోయింది. మంచి వాళ్ళని, వాళ్ళని ఆరాధించే మంచి వాళ్ళని దేవుడు ఎక్కువ కాలం ఉంచడు కదా! ఇప్పటికైనా మీ డాడీని అర్ధం చేసుకుంటే ఆయన ఆత్మ శాంతిస్తుంది." అన్నాను ఉబికి వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ. "ఓ... నో..! నిజమా? రియల్లీ ఐయామ్ వెరీ సారీ ఆంటీ, నేను చాలా ఇడియట్ లా ప్రవర్తించాను. మీవల్ల చాలా విషయాలు అర్ధం చేసుకున్నాను. సంస్కారవంతంగా ఆలోచించడానికి మీ హెల్ప్ ఎప్పుడూ నాకుంటుంది. ఐ లైక్యూ సోమచ్ ఆంటీ, మళ్ళీ కలుస్తాను బై!" అని వెళ్ళిపోయాడు.

అరుణ్ వెళ్ళిన చాలా సేపటి వరకు అలాగే కూచుండిపోయాను. నెమ్మదిగా లేచి టేబుల్ మీద వున్న నానోట్స్ అందుకున్నాను. దాని మీద రాసున్న డా. అనూరాధ పేరుని ఆప్యాయంగా తడిమాను. ఆ రోజు శ్రీకర్ మాటలు గుర్తొచ్చాయి. "మీ వారు 'అనూ' అంటారు, ఫ్రెండ్స్ 'రాధ' అంటారు. మరి నేను? అందరూ పిలిచిన పేర్లతో పిలిస్తే నా ప్రత్యేకత ఏముంది? నిన్ను ధనూ అని పిలవనా? నీపేరులోని అక్షరాలే" దుఃఖం కట్టలు తెంచుకుంది శ్రీకర్ ని తలచుకోగానే. "నన్ను ఇంతగా ఆరాధించావా శ్రీకర్?" అరుణ్ మనసులో తండ్రి పట్ల గౌరవం చెక్కుచెదరకుండా ఉండడం కోసం శ్రీకర్ తో పాటు ధనూని కూడా సజీవ సమాధి చేసేసాను. ఇంక ఆపేరు అవసరం ఎప్పటికీ ఎవరికీ రాదు. 'ధనూ' శ్రీకర్ తో శాశ్వతంగా వెళ్ళిపోయింది. 'ధనూశ్రీ' నా మరో రూపమని అరుణ్ కి ఎప్పటికీ తెలియదు. ఎంత సైకాలజిస్ట్ నైనా నేనూ సహజాతాలకి అతీతురాల్ని కానుగా!

***




"బావా! ఏం చేస్తున్నావ్ రా? 'సత్యం' లో కొత్త సినిమా వచ్చింది, పోదామా?" హుషారుగా వచ్చిన సమీర్, శశాంక్ వాలకం చూసి, విస్తుపోయాడు.

పేపర్లు, పెన్ను పట్టుకొని, డాబా మీద ఈజీచెయిర్లో కూర్చున్న శశాంక్, శూన్యంలోకి చూస్తూ దీర్ఘంగా నిట్టూర్పులు విడుస్తూంటే ఆశ్చర్యంగా అనిపించింది. చైతన్యానికి మారురూపులా ఉండే శశాంక్ అంత విచారంగా ఉండడం ఎప్పుడూ చూడలేదతడు. "ఏమిట్రా, ఏమైంది?" అడిగాడు, కంగారుగా...

"హు... నా జీవితమే సినిమా అయిపోయింది... బావా" అన్నాడు, శశాంక్ దీనంగా...

"అసలేం జరిగింది బావా? నన్ను టెన్షన్ పెట్టకుండా త్వరగా చెప్పు..." ఆదుర్దాగా అడిగాడు, సమీర్.

"చాలా పెద్ద సమస్య బావా, అసలి గండం ఎలా గట్టెక్కాలో నాకు అర్ధం కావటం లేదసలు..."

"అబ్బ, విషయం చెప్పరా, చంపక..." గట్టిగా విసుక్కున్నాడు, సమీర్.

"అదేరా, ఎల్లుండి, కౌముది పుట్టినరోజు..."

"వావ్... చక్కగా కలిసి సెలబ్రేట్ చేసుకోండి ఇద్దరూ... దానికి ఇంత దీనంగా ముఖం పెట్టుకుని కూర్చోవటం దేనికి? తనకి గిఫ్ట్ ఏమివ్వాలా, అనా?" నవ్వేసాడు, సమీర్...

"కాదురా... నేనేం గిఫ్ట్ ఇవ్వాలో తనే చెప్పేసింది... ఒక ప్రేమలేఖ వ్రాసివ్వాలట!"

"మరింకేం? సరియైన కానుకే అడిగింది... నువ్వు భావకుడివి కదా, ఒకటేమిట్రా, వంద మధురమైన లేఖలు వ్రాసివ్వగలవు... అసలు నీ కథలు చదివే కదరా, కౌముది మొదట నీకు ఫాన్, ఆ తర్వాత ఫ్రెండూ అయింది... అందుకే, నీ ప్రేమనంతా రంగరించి, అక్షరాలలో పొదిగి, ఓ లేఖగా మార్చి ఇస్తావని ఆశిస్తోంది. ఎంత మెసేజ్ ల లోనూ, మెయిల్స్ లోనూ మాట్లాడుకున్నా, కాగితం మీద నీ మనసును పరచి వ్రాసిన ప్రేమలేఖను చదువుకోవటంలో ఉండే థ్రిల్లే వేరు కదా... మంచి కోరికే కోరిందిరా, మా చెల్లాయ్..."

"అబ్బ, ఇంకాపరా, చిరాగ్గా ఉంది..." అసహనంగా అన్నాడు, శశాంక్.

"ఏమైందిరా, ఎందుకంత చిరాకూ?"

"నా మేనత్త కొడుకువి, చిన్నప్పట్నుండీ నా నేస్తానివి... నా చేతివ్రాత గురించి తెలుసుండీ అలా మాట్లాడతావేమిట్రా?"

"అరె, నిజమే... నీ చేతివ్రాతతో వ్రాసిన ప్రేమలేఖ అందుకుంటే మాత్రం ఆ అమ్మాయి డ్రాప్ అయిపోయే ప్రమాదం ఉందిరోయ్..."

"అర్థం చేసుకున్నావ్ గా, అదే, నా భయం..."

"ఐడియా! నువ్వు చేత్తో వ్రాసివ్వకుండా, డీటీపీ చేసి ఇవ్వచ్చుగా?"

"ఆహా, అలా కుదరదట... నా చేత్తో స్వయంగా, అందంగా వ్రాసిస్తేనే కానీ తనకు తృప్తి కలగదట..."

"అబ్బ, భలే అగ్నిపరీక్ష! అసలు ఎందుకురా నీ రాత అలా తగలబడింది?"

"చిన్నప్పుడు కాపీ రైటింగ్ సరిగ్గా వ్రాయక..."

"నేననేది, నీ చేతిరాత గురించి కాదులే, నీ తలరాత గురించి... సరే, పుట్టినరోజంటున్నావుగా, ఆ అమ్మాయిని నువ్వు ఎలాగైనా ఇంప్రెస్ చేయాలి... బ్యాక్ డ్రాప్ లో మంచి పూల డిజైనున్న లెటర్ ప్యాడ్ కొనుక్కొచ్చి, జాగ్రత్తగా అర్థమయ్యేలాగా పట్టి పట్టి లెటర్ వ్రాయి... పాయసంలో జీడిపప్పు, కిస్ మిస్ ల్లా మధ్యమధ్యలో నీ చిరుకవితలు, అందమైన పదాలు వెయ్యి... ఫైనల్ గా మంచి పెర్ఫ్యూమ్ స్ప్రే చేసి, దాన్ని కవరులో పెట్టి అందించు... నచ్చిందా, ఎంతో సంతోషపడుతుంది... లేదా నీ రాత గురించి అర్థమైపోయి సర్దుకుపోతుంది.

రేపు మీ పెళ్ళయ్యాకైనా తనకి విషయం తెలియాల్సిందేగా?"

"అంతేనంటావా?"

"అంతే మరి! సరే, నువ్వు కూర్చుని ప్రేమలేఖ తయారుచేసుకో, నేను మా ఫ్రెండ్స్ తో పోతాను, సినిమాకి... బై రా..." అంటూ వెళ్ళిపోయాడు, సమీర్.

***

సమీర్ చెప్పినట్టే, ఆ సాయంత్రం తాను వ్రాసిన ప్రేమలేఖను అందమైన కవర్ లో ఉంచి, దాన్ని అరవిరిసిన గులాబీపూల గుచ్చంలో అమర్చి, బెరుగ్గా కౌముదికి అందించాడు శశాంక్. అపురూపంగా దాన్నందుకొని, ఆరాటంగా అక్కడే తెరచి చూడబోతున్న కౌముదిని వారించి, 'ఇంటికి వెళ్ళిన తర్వాత చూసుకొమ్మని' కోరాడు. ఆమెతో కాసేపు గడిపి ఇంటికి వచ్చాడేకానీ అతని మనసు మనసులో లేదు... ఆ లేఖ చదివిన తరువాత ఆమె రియాక్షన్ ఎలా ఉంటుందో అంచనా వేయలేక, ఆలోచనలతో సతమతమవసాగాడు. నిద్రపట్టక ఆ రాత్రంతా పక్కమీద దొర్లుతూనే గడిపాడు, చివరికి ఎప్పుడో తెల్లవారుఝామున నిద్ర పట్టిందతనికి.

అక్కడ కౌముది ఇంట్లో, ఏకాంతంగా ఏవేవో మధురోహలతో సమీర్ ఇచ్చిన కవర్ తెరచి చూసి కంగారు పడింది. అది ప్రేమలేఖో, లేక శత్రుస్థావరాల గురించి మిలటరీవాళ్ళు వేసిన వ్యూహరచనో అర్థం కాలేదు. అందులోనివి అక్షరాలో, సంకేతాలో తెలియలేదు. మొదటి నాలుగు అక్షరాలనూ కష్టపడి, 'ప్రియమైన' గా పోల్చుకొంది. ఆ తర్వాత అన్నీ, గీతలు, చుక్కలు, ముద్దలు, పాములు, వంకరటింకర వరుసలు... అసలు ఆ అక్షరాలు అర్థమైతే ఒట్టు. అంత భయంకరమైన చేతివ్రాతను ఇప్పటిదాకా అసలెక్కడా చూసి ఉండలేదామె. 'అసలిది చేతివ్రాతా? శశిది ఇంత దారుణమైన దస్తూరీయా? అదే నిజమైతే. అంత మంచి రచయిత ఎలా అయాడతను? కాదు, ఇందులో ఏదో తమాషాగా ఉంది... ప్రాక్టికల్ జోక్ చేస్తున్నట్టున్నాడు...' ఇలా అనుకున్నాక, హృదయం తేలికై హాయిగా నిద్రపోయిందామె.

ఉదయం ఏడున్నరకు సెల్ ఫోన్ ఆగకుండా మ్రోగుతుంటే బద్ధకంగా దానిబటన్ నొక్కి, చెవిదగ్గర పెట్టుకొని 'హలో?' అన్నాడు శశాంక్, మత్తుగా. "గుడ్మార్నింగ్, శశీ! నేను... కౌముదిని... ఇంకా నిద్రపోతున్నావా?" హుషారుగా వినిపించింది, కౌముది గొంతు.

"హలో, కౌమూ..." అన్నాడు మెల్లగా. అటువైపు నుంచి కౌముది జలతరంగిణిలా నవ్వుతోంది. "యు ఆర్ వెరీ నాటీ శశీ... భలే మిస్చీఫ్ చేసావే, మీ ఇంట్లో అంత చిన్నపిల్లలెవరున్నారు?"

"చిన్న పిల్లలా?" అయోమయంగా అడిగాడు.

"అదే... ఆ హాండ్ రైటింగ్... నీ ప్రేమనంతా ఏ పిల్లలకు డిక్టేట్ చేసి రాయించావమ్మా?" గోముగా అంది.

"అది కాదు కౌమూ, అదీ... అదీ... నేనే వ్రాసాను... ఆ దస్తూరీ నాదే..."

"ఉదయమే నేనే దొరికానా, చెవిలో పువ్వు పెట్టడానికి? నీ ఆకతాయితనం ఇక చాల్లే..." నవ్వేస్తూ ఆమె ఫోన్ పెట్టేస్తే, ఏం చేయాలో తెలియక ఉక్రోషంతో జుట్టు పీక్కున్నాడు శశాంక్.

అయితే ఆ సాయంత్రం కలిసినప్పుడు ఎవరికీ అర్థంకాని తన చేతివ్రాత గురించి వివరంగా, నిజాయితీతో చెబుతున్న శశాంక్ మాటలు విన్న కౌముదికి ఏం చేయాలో అర్ధం కాలేదు. ఏమనాలో తెలియక జుట్టు పీక్కోవడం ఈసారి ఆమె వంతయింది.

" ఏమిటి శశీ ఇది? ఇదేం పిచ్చి రైటింగ్? ఇది డీకోడ్ చేయటం నిపుణుల వల్ల కూడా కాదు తెలుసా?" అంది కోపంగా.

"అదే కౌమూ, నా సమస్య... అదేమిటో చిన్నప్పటినుండీ నాకు ఎందుకో మంచి చేతివ్రాత అలవాటు కాలేదు. అందుకే సబ్జెక్ట్ ఎంత బాగా వ్రాసినా, ఎంత చురుగ్గా ఉన్నా, లెక్కల్లో తప్ప, పరీక్షల్లో ఎప్పుడూ మార్కులు తక్కువే వచ్చేవి..."

"అవునులే, అసలు అర్థమై చస్తేగా మీ మాష్టర్లకు... ఇంతకూ, ఆఫీసులో ఎలా మేనేజ్ చేస్తున్నావో?"

"ఆఫీసులో పెద్దగా వ్రాసే పని ఉండదుగా, నా పని అంతా సిస్టమ్స్ మీదనే ఉంటుంది... అలాగే అలవాటైపోయింది. ఇంక రాసే అవసరం ఏముంటుంది? మరీ కోడి గీతల్లా ఉన్నాయా నా అక్షరాలు?" దీనంగా అడిగాడు.

"గట్టిగా అనకు, కోడి వింటే ఆత్మహత్య చేసుకుంటుంది... మరి నీ కథలూ, కాకరకాయలూ ఎలా వ్రాస్తావు?"

"మొదట్లో కాగితాల మీదనే వ్రాసి పంపించేవాడిని. అయితే అవి, వెంటనే తిరుగుటపాలో వెనక్కి వచ్చేసేవి. పాపం వాళ్ళ తప్పేం ఉందిలే, ఏం వ్రాసానో, అసలది కథో, కవితో వాళ్ళకు అర్థం అయితేగా? పైగా, పేజీలో లైన్ మొదలుపెట్టాక, 45 డిగ్రీల కోణంలో వంకరగా వెళ్ళిపోయేది. ఒక్కోసారి ఏం వ్రాసానో నాకే సరిగ్గా అర్థం అయ్యేది కాదు. ఆరునెలలు గడిచాక, స్ఫురించింది, నేను ఏం చేయాలో... తెలుగు ఫాంట్స్ లో టైప్ చేయటం నేర్చుకొని, డీటీపి చేసి, నా రచనలు పత్రికలకు పంపించటం మొదలుపెట్టాను. అప్పట్నుండీ అవి అచ్చవటం మొదలయింది" వివరించాడు, శశాంక్.

"శశీ, నువ్వేం చేస్తావో నాకు తెలియదు. నువ్వు మంచి హాండ్ రైటింగ్ నేర్చుకొని, తెలుగు, ఇంగ్లీష్ బాగా వ్రాయటం ప్రాక్టీస్ చేయి. అలా అయితేనే నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను..." ఖండితంగా చెప్పేసింది, కౌముది.

"ఏయ్, నీకిదేం పిచ్చి? అసలు, నా దస్తూరికీ, మన పెళ్ళికీ సంబంధం ఏమిటి కౌమూ, చాదస్తం కాకపోతే..." విసుక్కున్నాడు శశాంక్.

"ఏమో, నాకు తెలియదు. ఈ పిచ్చి వ్రాతను నేనుమాత్రం భరించలేను. దానిని సంస్కరించుకోవటానికి నేను నీకిచ్చే గడువు మూడునెలలే... వస్తాను..." కండిషన్ పెట్టేసి వెళ్ళిపోయింది, కౌముది.

"హతవిధీ..." మళ్ళీ తలపట్టుకున్నాడు, శశాంక్.

సమీర్ సలహాతో మూడు నెలల్లో ముత్యాల్లాంటి దస్తూరి నేర్పుతామని బోర్డ్ పెట్టుకున్న 'క్యూట్ హాండ్ రైటింగ్ కోచింగ్ స్కూల్ లో చేరాడు కానీ అది తన ఆఫీసుకు చాలా దూరం కావటం వల్లా, తన ఆఫీసు టైమింగ్స్ తో ఆ స్కూల్ టైమింగ్స్ మ్యాచ్ కాకపోవటం వల్లా ఆ కోర్స్ మధ్యలోనే మానేయవలసి వచ్చింది.

మూడు నెలల తర్వాత ఎంతో ఆశగా తన దగ్గరకు వచ్చిన కౌముదికి ఏం జవాబు చెప్పాలో తెలియక పేలవంగా నవ్వాడు, శశాంక్. పరిస్థితి ఇంకా అలాగే ఉందని గ్రహించిన కౌముది, తన ఆశలన్నీ అడియాసలయాయని బాధ పడినా, శశాంక్ అంటే ఉన్న ప్రేమ వల్లను, అతని మంచితనం ముందు ఇది ఓ లోపం కాదని తల్లిదండ్రులు, తోబుట్టువులు, స్నేహితురాళ్ళతో పాటు సమీర్ కూడా నచ్చజెప్పిన మీదట, శశాంక్ ను క్షమించేసింది, కౌముది. ఆ తర్వాత ఇరువైపుల పెద్దల ఆశీర్వచనాలతో ఝామ్మని పెళ్ళయిపోయింది.

***

రెప్పవేయకుండా దీర్ఘంగా ఆ కాగితం వైపే చూస్తూ, సుదీర్ఘంగా ఆలోచిస్తున్నాడు వెంకట్.

అతనివైపే ఆందోళనగా చూస్తోంది, ఎదురుగా ఒడిలో పసివాడితో కూర్చున్న కౌముది.

"ఊ..." భారంగా నిట్టూర్చాడతను... "అసలేమైంది మేడమ్? మీవారు మీతో ఏమైనా గొడవ పడ్డారా?" అన్నాడు, గంభీరంగా.

"అబ్బే, అదేం లేదే, అసలు ఏం వ్రాసారాయన ఆ కాగితంలో?" ఆరాటంగా అడిగింది.

వెంకట్ ఏమీ అనకపోవటంతో, మళ్ళీ తనే, "నేను వీడిని తీసుకొని హాస్పిటల్ కి వెళ్లివచ్చేసరికి, సాయంత్రం ఆరు దాటింది. సాధారణంగా ఆ టైముకి ఆయన ఆఫీసునుంచి వచ్చేస్తారు. అయితే, రాత్రి తొమ్మిదయినా రాలేదు. మొబైల్ కి ఫోన్ చేస్తే, 'అవుటాఫ్ కవరేజ్ ఏరియా' అని వస్తోంది. నాకు చెప్పకుండా ఎక్కడికీ వెళ్ళరాయన. తర్వాత చూస్తే, డ్రెసింగ్ టేబుల్ మీద, పౌడర్ డబ్బా కింద ఈ చీటీ పెట్టి ఉంది. ఇప్పటిదాకా ఇంటికి రాలేదు. ఎంత చదివినా, ఏమీ అర్థం కాక - మీ మెడికల్ షాప్ వాళ్లకు డాక్టర్ల ప్రిస్క్రిప్షన్లు ఈజీగా చదవటం అలవాటు కదా, ఇందులో ఆయన ఏం వ్రాసారో చదివి చెబుతారని తెల్లవారాక, మీ దగ్గరకు తెచ్చాను..."

"అదే, మేడమ్, డాక్టర్లు వ్రాసిన చీటీలు ఎలా అయినా సరే, చదివి అర్థం చేసుకోగలం. కానీ ఇందులో వ్రాసింది మాత్రం ఏమాత్రం బోధపడటం లేదు..." నిస్సహాయంగా పెదవి విరిచాడు మెడికల్ షాపతను వెంకట్.

"ఇంతలో, ఇదేమిటి చెల్లాయ్, ఇక్కడున్నావ్?" అంటూ బయట బైక్ పార్క్ చేసి ఆ షాప్ లోకి వచ్చాడు, సమీర్.

"అన్నయ్య, దేవుడిలా వచ్చావన్నాయ్... శశి కలిసాడా నిన్ను? ఎక్కడికి వెళ్ళాడో తెలియటం లేదు... నిన్నట్నుంచి కనబడటం లేదు..." కంగారుగా మాట్లాడసాగింది,

కౌముది.

"మామూ మామూ" అంటూ సమీర్ మీదకి ఉరికాడు, బన్నీ.

వాడిని అందుకుంటూ, "అదేమిటి కౌముదీ, అంత కంగారు పడిపోతున్నావు? వాడు నిన్న అర్జెంటుగా ఆఫీసు పనిమీద బెంగుళూర్

వెళ్ళాడుగా? నాకు ఫోన్ చేసి చెప్పాడు... నీకు తెలియదా?" అన్నాడు, సమీర్.

"అదేమిటీ, నాకు ఫోన్ చేయలేదే..." ఆలోచనలో పడిన కౌముదికి అప్పుడు గుర్తుకొచ్చింది. ముందురోజు తన మొబైల్ ని బన్నీగాడు నీళ్ళలో పడేయటంతో అది పనిచేయటం లేదన్న సంగతి. అందుకే తనకు చెప్పటం కుదరక చీటీ వ్రాసి, బయలుదేరి వెళ్ళిపోయినట్టున్నాడు. కౌముది మనసు కాస్త కుదుటపడింది.

"ఆ... మేడమ్... ఇందులో అదే ఉంది... అర్జెంట్ పని మీద బెంగుళూర్ వెళుతున్నానని వ్రాసారు..." అమెరికాని కనిపెట్టిన కొలంబస్ లా చూస్తున్న వెంకట్ ను అదోలా చూస్తూ, "సర్లెండి, మీ సహాయానికి చాలా థాంక్స్..." అని చెప్పేసి, "రా చెల్లాయ్, నిన్ను ఇంటి దగ్గర దింపేస్తాను..." అంటూ ముందుకు కదిలాడు, సమీర్.

ఇంటికి చేరాక, ఆమె ఇచ్చిన కాఫీ తాగుతూ, "ఏమిటమ్మా ఇది? వాడి రాతలు మనకి అర్ధం కాకపోవటం కొత్తేమీ కాదుగా? అంత గాబరా పడిపోయావేమిటి?" అన్నాడు, సమీర్.

"అదికాదన్నయ్యా, ముందు రోజు, ఏదో చిన్న విషయానికి ఇద్దరమూ కొద్దిగా ఘర్షణ పడ్డాం. శశి మనసు చాలా సున్నితం కదా, అంచేత నా మీద అలిగి, ఈ చీటీ పెట్టేసి, ఇంట్లోంచి వెళ్ళిపోయాడేమోనని భయం వేసింది..." తలొంచుకొని చెప్పింది, కౌముది.

"వాడి మొహం... వాడు వీడిని, నిన్నూ వదిలి ఎక్కడికి వెళతాడు?" నవ్వేసి, నిద్రలోకి జారుకున్న బన్నీ బుగ్గలు నిమిరి వెళ్ళిపోయాడు, సమీర్.

***

కాలచక్రం వేగంగా తిరుగుతోంది.

మూడు సంవత్సరాలలో శశాంక్ మంచి పేరున్న రచయిత అయిపోయాడు. ఏ పత్రిక చూసినా అతని పేరే... అతని సీరియల్సే... అతని రెండు నవలలు సినిమాలుగా వచ్చాయి.

బాసర క్షేత్రంలోని జ్ఞానసరస్వతిదేవి ఆలయంలో అక్షరాభ్యాసం జరిపించి, బన్నీని ప్లేస్కూల్ లో వేసారు, కౌముది, శశాంక్.

ఆ రోజు ఆదివారం. స్కూల్ లో వాడికి నేర్పించిన అక్షరాలను పలకమీద వ్రాసి, వాడితో దిద్దించటానికి శతవిధాలా ప్రయత్నించసాగింది, కౌముది. వాడు దిద్దకుండా, తల్లికి దొరక్కుండా పరుగులు తీస్తూ ఆమెను ఆటపట్టించసాగాడు. 'అంతా తండ్రి పోలికే, దిద్దమంటే దిద్దకుండా నా ప్రాణం తీస్తున్నాడు...' శశాంక్ కి వినబడకుండా పళ్ళునూరుతూ వాడి వెంటబడి మరీ పట్టుకొని బలవంతంగా అక్షరాలు దిద్దించసాగింది, కౌముది.

అరగంట తర్వాత,

కంప్యూటర్ లో కథ వ్రాసుకుంటున్న శశాంక్, అక్కడే నేలమీద కూర్చుని పలక మీద గీస్తున్న బన్నీని చూసి ముచ్చటపడ్డాడు.

కాఫీ తెచ్చిచ్చిన కౌముదితో, "కౌమూ, వాడెంత అందంగా బొమ్మలు గీస్తున్నాడో చూసావా... చూడు, పలక మీద ఆ ఎగిరే పక్షుల్ని ఎంత బాగా వేసాడో... మంచి చిత్రకారుడౌతాడు సుమా!" అన్నాడు మురిసిపోతూ.

"నా మొహం... అవి పక్షులు కావు...' ఎ, బి అక్షరాలు..." అంత అందంగా వచ్చాయి బుల్లిదొరగారికి... వారసత్వం ఎక్కడికి పోతుందీ?" సాగదీసింది, కౌముది.

ఒక్కసారిగా కళ్ళుతిరిగినంత పనయింది, శశాంక్ కి.

"ఆ, అక్షరాలా అవి?" అని విపరీతంగా ఆశ్చర్యపోయి, తమాయించుకుంటూ, "పోనీలేవోయ్, వాడు నన్ను మించిన రచయిత అవుతాడులే చూడు..." అన్నాడు, శశాంక్...

అతని వైపు కోపంగా చూడబోయినా, బిక్కమొహం పెట్టిన భర్తను చూస్తుంటే కౌముదికి నవ్వాగలేదు.

తానూ నవ్వేస్తూ, కొడుకును ఒడిలోకి తీసుకుని, రెండు బుగ్గలమీదా ముద్దులు కురిపించాడు శశాంక్. అమ్మా నాన్నా నవ్వుతుంటే, ఘనకార్యం చేసిన వాడిలా పలకను శశాంక్ కు చూపిస్తూ తాను కిలకిలా నవ్వసాగాడు చిన్నారి బన్నీ...

***




# అభిసారిక

## కందుకూరి రాజకుమారి

ఉలిక్కిపడి నిద్ర లేచాను. ఈ రోజు శనివారం. నాకూ పిల్లలకూ సెలవు. పొద్దున్నే లేవనవసరం లేదు. అందుకే అలారం కూడా పెట్టుకోలేదు. అయినా, ఎప్పుడు ఇంతసేపు పడుకోను. ఆరవకుండానే సెలవురోజైనా అలవాటు ప్రకారం మెలకువ వచ్చేస్తుంది. కానీ ఈ రోజెందుకో బాగా నిద్ర పట్టేసింది. రాత్రి పిల్లలూ, నేనూ కలిసి టీవీలో 'పోకిరి' సినిమా చూసి పడుకున్నాము. సినిమా పూర్తయ్యేసరికి బాగా లేటయింది.! శ్రీవారు క్యాంపు కెళ్ళారు. ఈరోజు రావాలి. కానీ ఇంతవరకు ఏ కబురూ లేదు. పిల్లలింకా లేవలేదు. రాత్రి లేట యిందిగా, వాళ్ళప్పుడే లేవరు.

www.gotelugu.com www.gotelugu.com www.gotelugu.com www.gotelugu.com www.gotelugu.com www.gotelugu.com

టూరుస్తూ గోడ గడియారాన్ని చూస్తే టైము ఏడు కావస్తోంది. తను ఈపాటికి రావాలే! అసలు తను వచ్చే వేళయిందనే మెలుకువొచ్చి, హడావిడిగా పక్కలోంచి లేచాను. అర్జంటుగా పాలు కాచాలి. తను రాగానే ముందు 'ఛాయ్' పెట్టియ్యాల్సిందే. తనకి నా చేతి టీ చాలా ఇష్టం. అది పడితేగానీ పని నడవదట. నాకు అలా పొగిడించుకోవడం ఇష్టమే! అందుకే ఇంట్లో ఇంకెవ్వరూ

తాగకపోయినా తన కోసం ప్రత్యేకంగా టీ పెడతాను.

పాలు కాచడం అయిపోయింది. తనింకా రాలేదేంటి? సెలవురోజు కదా, లేటుగా లేస్తామని ఆలోచించుండచ్చు. కానీ టైము ఏడున్నర - ఇంత లేటవ్వదు తనకి సాధారణంగా.

ఏమీ తోచక టీవీ పెట్టాను. "నీ రాక కోసం నిలువెల్ల కనులై..." అంటూ శ్రావ్యంగా పాడుతోంది ఒక చిన్న పాప. అంత లేత వయసులో ఎంత మాధుర్యం! అసలా పిల్లకి అంత భావం ఎలా పలుకుతుంది? తనకా పదాల అర్థం తెలుసోలేదో! హు! మా చిట్టీ ఉంది, ఎందుకూ? సంగీతం నేర్చుకోవే, చక్కగా టీవీలో పాడొచ్చూ అంటే అస్సలు వినిపించుకోదు. ఎప్పుడు చూసినా ఆటలే! పాప పాట మైమరిపిస్తున్నా, అక్కడ నా పాప పాడట్లేదని బాధ పడుతూ, ప్రోగ్రాం చూస్తున్నాను. ఆ చిన్నారి, "రావేలా... రావేలా..." అంటూ ఉంటే, నా కళ్లు నాకు తెలికుండానే వాకిలి వైపు చూస్తున్నాయి. తనింకా రాలేదు! ఏమయిందో ఏమో.

టెన్షను భరించలేక, టిఫిను ప్రయత్నాలు మొదలుపెట్టాను. తనకి నా చేతి ఉప్మా చాలా ఇష్టం. అసలు మా ఇంట్లో తన తర్వాతేగా ఎవరైనా తినేది. టైము కేసి చూసుకుంటూనే, ఉప్మా చేయడం మొదలుపెట్టాను. పని చేస్తున్నాను కానీ నా దృష్టంతా గుమ్మం వైపే ఉంది. అప్పుడే అడుగుల చప్పుడయింది. మా ఫ్లాట్సులో దగ్గర దగ్గరగా మూడు గుమ్మాలుంటాయి. అందుకే ఆత్రుతగా ఎవరి బెల్లు మోగుతుందా అని ఎదురుచూసాను. మా ఎదురు ఫ్లాటు బెల్లు కొట్టారెవరో! ఆయితే తను కాదన్న మాట! ప్చ్...

ఉప్మా ఉడుకుతోంది. నాకు మండిపోతోంది. ఫోనుంది. నంబరు తెలుసు. లేటవుతుందని ఫోను చేసి చెప్పచ్చు కదా! ఊహుఁ! నేనెన్నిసార్లు చెప్పినా, అసలు లెక్కలేదు తనకి. నేనే సర్దుకుపోతాలే అన్న ధీమా! ఎంతైనా అవసరం నాది కదా - అలా మాత్రం ఎందుకనుకోవాలి? తన అవసరం నాకెంతో, నా అవసరం తనకీ అంతే కదా! అయినా తనదే రాజ్యం - అలా సాగుతోంది మన సమాజంలో.

అంతలో బెల్లు మోగింది. మనసు పులకరించింది. పరుగున వెళ్లి తలుపు తీస్తే, తను కాదు, మా నాన్న. నిరాశగా నిట్టూర్చి, కిచెను వైపు నడిస్తే, "మీ ఆయనింకా రాలేదామ్మా?" అన్నారు నాన్న ఎంతో ఆప్యాయంగా.

"లేదు! ఏ కబురూ లేదు, కానీ ఎప్పుడైనా రావచ్చు- ఉప్మా తింటారా?", మూడాఫ్లో ఉన్నానేమో కొంచెం దురుసుగానే జవాబు చెప్పాను.

"వద్దమ్మా, మీ అమ్మేదో టిఫిను చేస్తోంది -"

అమ్మ, నాన్న మా అపార్టుమెంట్సుకి దగ్గిరలోనే ఉంటారు. రిటైర్మెంటుకి రెండేళ్ల ముందు, రెండు పోర్షన్ల ఇల్లు కట్టుకున్నారు నాన్న. నాన్న రిటైరయ్యేదాకా వాళ్లు క్వార్టర్సులో ఉండేవారు కాబట్టి, మేమా ఇంటి కింద పోర్షన్లో ఉండి, పై పోర్షను అద్దెకిచ్చాం. అప్పుడే దగ్గర్లో ఫ్లాటు బుక్ చేసుకున్నాం. అమ్మ, నాన్న వచ్చే టైముకి మా ఫ్లాటు రెడీ అయిపోవడంతో, మేమక్కడకి షిఫ్ట్ అయిపోయాం. పై పోర్షను అలాగే అద్దెకుంచి, వాళ్లిద్దరూ కింది పోర్షనులో ఉంటున్నారు.

అమ్మకి నాన్నకి ఏకైక సంతానం నేను. నా గొప్పలు నేను చెప్పుకోకూడదు కానీ, గారాబంగా పెరిగినా - మంచి మర్యాద, వంటా వార్పు, వినయం విధేయత - పరంగా సుగుణాల రాశిని. కాస్తో కూస్తో అందగత్తెను కూడా. బాగా చదువుకున్నాను, సెంట్రల్ యూనివర్సిటీలో ఇంగ్లీషు ప్రొఫెసరు ఉద్యోగం చేస్తున్నాను. మాకు క్వార్టర్సు ఇస్తారు కానీ సీనియారిటీ ప్రకారం చూస్తే నాకు ఇప్పట్లో వచ్చే అవకాశాలు తక్కువ. అయినా సొంత ఫ్లాటు. పక్కనే అమ్మ, నాన్న. ఇక క్వార్టర్సెందుకు?

మా వారు మాకు దూరపు బంధువే! ఏదో పెళ్లిలో నన్ను చూసి, ముచ్చటపడి కోడలిని చేసుకున్నారు మా మామయ్య. కానీ మా పెళ్లయి ఏడాది తిరక్కుండానే గుండెపోటుతో కాలంచేసారు. ఆయన మీద బెంగతో మా అత్తయ్య కూడా ఆయన పోయిన రెండునెల్లకే కన్నుమూసింది. మాకప్పట్నుంచీ అమ్మ, నాన్నే పెద్ద దిక్కు!

నాన్న రోజూ పొద్దున్నే వాకింగుకెళ్లి వచ్చేటప్పుడు కాసేపు మమ్మల్ని పలకరించి, పేపరు చదివి (అమ్మ కోసం వాళ్లు ఈనాడు తెప్పించుకుంటారు, మేము టైమ్సాఫిండియా తెప్పిస్తాం), కాఫీ తాగి ఇంటికి వెడతారు. మూడ్ ఉంటే టిఫిను కూడా చేసి వెడతారు. అప్పుడు అమ్మకి కూడా బాక్సులో పెట్టి పంపించేస్తూంటాను.

నాన్న నా మూడెలా ఉందో ఈజీగా కనిపెట్టేస్తారు - కానీ ఏమీ తెలీనట్టే ఉంటారు. నా వినయం విధేయతా, అంతా బయిటవాళ్ల దగ్గరే! నాకు చిరాకుగా ఉన్నప్పుడు నాన్నని విసుక్కుంటాను. పాపం ఆయనసలు పట్టించుకోరు. ఎప్పటిలాగే పలకరించి, పేపరు చదువుకుని వెళ్లిపోతారు - కానీ అలాంటప్పుడు టిఫిను మాత్రం చేయరు. తర్వాత బాధనిపిస్తుంది నాకు. కానీ మళ్లీ తను లేటొచ్చినప్పుడు నా మూడ్ అలానే ఉంటుంది, నాన్నని విసుక్కుంటాను, ఆ తరువాత బాధపడతాను - ఐ కాన్ట్ హెల్పిట్!

నాన్న మౌనంగా కాఫీ తాగి వెళ్లిపోయారు. తన జాడ మాత్రం లేదు! నేను కొంచెం ఉప్మా ప్లేట్లో వేసుకుని టీవీముందు కూర్చుని తినడం మొదలుపెట్టాను - మళ్లీ గుమ్మం ముందు అడుగుల చప్పుడు! ఊపిరి బిగపట్టి మరీ ఎదురు చూసాను కానీ ఆ అడుగులు మా గుమ్మం దాటుకుని ముందుకు వెళ్లిపోయాయి. నిజానికి తన అడుగుల చప్పుణ్ణి నేను ప్రత్యేకంగా గుర్తుపడతాను - మా

అనుబంధం అలాంటిది. కాని ఎదురుచూపులో మాత్రం మనసంతా గజిబిజి అయిపోయి ఎవరి అడుగుల చప్పుడు విన్నా, తనవైతే బాగుణ్ణని ఆత్రపడుతూంటాను. ఎదురుచూపులో ఎంత బాధ! అదయ్యాక దర్శనభాగ్యమిచ్చే అనుభూతి కూడా స్పెషల్ గానే ఉంటుంది కదా మరి! అంతలో "అమ్మా!" అని అరుపులాంటి పిలుపు.

పాపకి లేవగానే నేను కనపడాలి - లేకపోతే ఇల్లదిరిపోయేలా అరుస్తుంది.

"ఇలారా చిట్టితల్లి - టీవీ దగ్గరున్నాను, టిఫిను చేసాను - ఉప్మా! దామ్మా!" అన్నాను. ఎంత విసుగ్గా ఉన్నా, దాన్ని మాత్రం బుజ్జగించాల్సిందే - లేకపోతే దారుణంగా పేచీ పెట్టేస్తుంది. ఆ తరువాత దాన్ని ఊరుకోపెట్టాలంటే నా తల ప్రాణం తోకకొస్తుంది.

"నువ్వే రా! నన్నెత్తుకో" అందది. తప్పుతుందా! నిస్సత్తువగా వెళ్లాను.

"గుడ్ మార్నింగ్ బంగారు! దా" అంటూ ప్రేమగా మంచంమీంచి లేవదీసాను. దాన్నలాగే ఎత్తుకుని, పక్క మంచం మీద పడుకుని నిద్ర నటిస్తున్న బాబుని తట్టి "యాక్షన్లు చాలుగానీ, ఇక లేవండి" అన్నాను. అసలే పొద్దున్నే చిరాకుగా ఉంటే వీడి ఆటలొకటి అని మనసులో తిట్టుకుంటూ. బాబు నవ్వుతూ లేచి నన్ను పట్టుకున్నాడు.

పాపకి నాలుగేళ్ళు - యూకేజీ. బాబుకి గాడిదలా పదేళ్లొచ్చినా నేను చెల్లికేది చేస్తే వాడికీ అదే చేయాలంటాడు. నువ్వు పెద్దవాడివిరా అంటే నాకు చిన్నప్పుడలా చేసావా అని నన్ను దెప్పి పొడుస్తాడు. నాకు చెల్లి అంటేనే ఇష్టమట. వాడంటే లేదట. అన్నీ వాడే అనేసుకుంటాడు. అప్పుడప్పుడు వాడిని సముదాయిస్తూంటాను. మన ఫామిలీ అంతా ఒకటేననీ, పిల్లలిద్దరూ మాకు రెండు కళ్లనీ, చెల్లి చిన్నది కాబట్టి మనమంతా దాన్ని జాగ్రత్తగా చూసుకోవాలనీ. అన్నీ అర్థమైనట్టే అనిపిస్తుంది. కొన్నాళ్లు బాగానే ఉంటాడు, కానీ మళ్లీ మామూలే - వాడికి చిన్నపిల్లతో పోటీ ఏమిటో అర్థంకాదు.

"అమ్మకి చిరాగ్గా ఉందమ్మా, ఇద్దరూ బ్రష్ చేసుకుని తొందరగా వస్తే ఉప్మా పెడతాను, కమాన్" అంటూ పిల్లలని అదిలించాను. బాబు బాత్రూం వైపు పరిగెత్తాడు. పాప మాత్రం, "నువ్వే బ్రష్ చెయ్యి", అని ఆర్డరు వేసింది. తప్పుతుందా! నేనూ బాత్రూం వైపు దారి తీసాను - పాపనెత్తుకుని.

అదయ్యేసరికి కాలింగ్ బెల్ మోగింది. కళ్లు అప్రయత్నంగానే గడియారాన్ని చూసాయి. టైము తొమ్మిదిన్నర! ఖచ్చితంగా తనే అయ్యుండాలి. రానీ చెప్తాను - ఇంత లేటా, అదీ కబురూ కాకరకాయ లేకుండా. నేనూరుకోను - ఈరోజు బాగా దెబ్బలాడాల్సిందే!

పోనీ కదా అని ఊరుకుంటూంటే, రాను రానూ ఈ నిర్లక్ష్య వైఖరి ఎక్కువైపోతోంది - అనుకుంటూ పాపనెత్తుకునే వెళ్లి తలుపు తీసాను. ప్చ్, వచ్చింది తను కాదు, మా వారు!

"నాన్నా" అంటూ పాప ఆయన దగ్గరికి వెళ్లిపోయింది ఆనందంగా. "మీరా?" అని నిరుత్సాహంగా లోనికి దారి తీసాను నేను. పాపనీ, బ్యాగునీ, కష్టపడి బ్యాలన్సు చేసుకుంటూ నా వెనకే వచ్చారు ఆయన.

"టిఫినేం చేసావ్ అభీ -" అంటూ, పాపతో సహా సోఫాలోకి కూలబడ్డారు. పాపం ప్రయాణపు అలసట తన మొహంలో బాగా కనబడుతోంది. కానీ నా చిరాకులో నేనున్నాను.

"ఉప్మా చేసాను, ఇదిగో తెస్తున్నాను" అన్నాను ముభావంగా, నా విసుగుని దాచుకోవడానికి ప్రయత్నిస్తూ, తనింకా రాలేదేంటాని ఆలోచిస్తూ.

మావారికి కూడా సీను అర్థమయిపోయినట్టుంది, నన్నెక్కువ మాట్లాడించకుండా, పాపకి తినిపిస్తూ తనూ తినేసారు. ఇంతలో బాబు స్నానం కూడా చేసేసి వచ్చి నా మెప్పు కోసం గొప్పగా చూసాడు.

"అరే! మా బంగారు తండ్రి స్నానం కూడా చేసేసాడే!" అన్నాను నా చిరాకుని కంట్రోల్ చేసుకుంటూ.

బాబుకి కూడా ప్లేట్లో టిఫినిచ్చి వాళ్ల నాన్న దగ్గర కూర్చోపెట్టాను. నేను మా వారికి కాఫీ కలపడానికి కిచెన్లోకి వెడుతూ ఆలోచిస్తున్నాను - తనింకా రాలేదంటే, ఇక ఈ రోజుకు రానట్టే! ఏమైందో ఏమో! కాఫీ కలుపుతున్నాను కానీ నా మనసునిండా తన గురించిన ఆలోచనలే!

ఇంతలో అడుగుల చప్పుడు! నాకు ఎంతో సుపరిచితమైన చప్పుడది. క్రమంగా ఆ అడుగులు దగ్గరపడుతూ వచ్చి, మా గుమ్మం ముందు ఆగాయి. కాలింగ్ బెల్ మోగింది. నా మదిలో వేయి వీణలు మోగాయి. నేను తీసే లోపు మా బాబు పరిగెత్తుకుంటూ వెళ్లి తలుపు తీసాడు. నేను ఆత్రుతగా చూస్తున్నాను - సందేహంలేదు, తనే! అయినా మనిషిని చూస్తేనే కదా మనసు కుదుటపడేది!

బాబు తలుపు తెరిచాడు -

ఆఁ! వచ్చింది తనే - నా కనుల విందుగా మా గుమ్మంముందు నిండుగా (కొంచెం లావు లెండి) నిలబడి ఉన్నది మరెవరో కాదు - మా పనిమనిషి రంగి!

నా చిరాకు తగ్గిపోయింది. మా బాబు తలుపు తీసినందుకు నాకు చాలా ముద్దొచ్చాడు. పాపకి స్నానం చేయించాలని గుర్తుకొచ్చింది. మా వారిని క్యాంప్ విశేషాలడగాలి. పాపం నాన్నని పొద్దున్న విసుక్కున్నాను - టిఫిను కూడా పెట్టలేదు. మా సెలవు రోజు ఇప్పుడే స్టార్టయింది!

అన్నట్టు నన్ను నేను పరిచయం చేసుకోలేదు కదూ - నా పేరు అభిసారిక!




"వింధ్య హిమాచల యమునా గంగా...

ఉచ్చల జలధిత రంగా..."

రాహుల్ నోటి నుండి ఆకస్మాత్తుగా వినిపించిన ఆ రాగాలాపన విని ఉలిక్కిపడి, అటువేపు చూసింది వింధ్య.

వింధ్య అప్పుడే ఆఫీసు నుండి వచ్చింది...

అక్క సంధ్య ఇంట్లో లేదు...

బావ రాహుల్ ఒక్కడే ఒంటరిగా ఉన్నాడు...

ఆ రాగాలాపనలో 'వింధ్య' అనే మాటని ఒత్తి, నొక్కి చెప్పటం ఆమెని కొంచెం ఆలోచించేలా చేసింది...

"ఏంటి బావా... ఈ మధ్య దేశభక్తి బాగా ఎక్కువైనట్లుగా ఉంది... తరచూ జాతీయ గీలాపన చేస్తున్నావు..." ఆలవోకగా అడిగేసింది...

రాహుల్ ముఖం ఆనందంగా వెలిగిపోయింది.

"మరదళ్ళ పై భక్తే గాని... దేశభక్తి మగాళ్ళ కుంటుందంటావా చెప్పు..." నర్మగర్భంగానే ప్రశ్నించాడు.

"అంతే కదా.. ఏమో నిజంగా దేశభక్తేనేమోనని తెగ ఆనందపడిపోయాను..." అంటూ బాత్రూంలోనికి దూరింది వింధ్య.

స్నానం చేస్తోందే కాని మెదడు నిండా లేనిపోని ఆలోచనలు వింధ్యను చుట్టుముట్టేస్తున్నాయి.

బావ చూపులు కూడా ఇది వరకటిలా లేవు…

మాటల సంగతి ఇక సరే సరి.

అక్క అరనిమిషం లేకపోతే చాలు అపరిచితుడులా మారిపోతున్నాడు… ప్రవర్తనలో కూడా తేడా వచ్చేస్తోంది.

ఒక్క మాటలో చెప్పాలంటే -

అక్క ఉంటే రాముడు… లేకపోతే కలియుగ కృష్ణుడు.

బావ తననుండి ఏదో ఆశిస్తున్నాడని సూటిగా అర్ధమవుతూనే ఉంది.

ఈ విషయం అక్కతో మాట్లాడితే… ఏమనుకుంటుందో ఏమో! అక్కే బావని గట్టిగా నిలదీస్తే వారిద్దరి మధ్య గొడవవుతుందేమో!

స్నానం పూర్తయిపోయింది కాని వింధ్య ఒక నిర్ణయానికి రాలేకపోయింది.

***

వింధ్య అక్క సంధ్యకు తోడుగా ఉండడం కోసం హైద్రాబాద్ వచ్చింది… అనుకోకుండా అదృష్టవశాత్తూ సాఫ్ట్ వేర్ ఉద్యోగం దొరకడంతో… అక్కతో పాటే ఉండిపోయింది.

వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ కి వెళ్ళిపోతానని చెప్పినా వింధ్యని సంధ్య వెళ్ళనివ్వలేదు. దాంతో పెళ్ళయ్యేదాకా అక్కతోనే ఉండమని తల్లిదండ్రులు కూడా చెప్పడంతో మరో మార్గం లేకుండా పోయింది.

నిజానికి సంధ్య అందం విషయంలో వింధ్య కే మాత్రం తీసిపోదు... రంగు, శరీర సౌష్టవం, ఎత్తు, లావు - అంతా సమానమే. ఒక్కమాటలో చెప్పాలంటే సంధ్య ఈజ్ ఈక్వల్ టూ వింధ్య. వస్త్రధారణలో తప్ప ఇద్దరికీ ఏ విషయంలోనూ వ్యత్యాసం లేనే లేదు.

సంధ్య చీరకట్టులో ఉంటే, వింధ్య చూడిదార్ లలో మెరుస్తూ ఉంటుంది. వింధ్య కు పై పెదవి పై పుట్టుమచ్చ ఉంటుంది.

పై పెదవి మీద నున్న గోధుమరంగు పుట్టుమచ్చను గుర్తిస్తే తప్ప... ఒకే రకంగా ఉన్న సోదరీమణుల్ని పోల్చుకోవటం, గుర్తించటం అంత సులభం కూడా కాదు...

అదే ఇప్పుడు వింధ్య కు సమస్యయి కూర్చుంది...

పొరపాటున చీరకట్టిందా... వెనక నుండి హత్తుకునే ప్రయత్నం చేయడం - 'సారీ... వింధ్యా... సంధ్యనుకున్నాను...' అని చెప్పేయటం రాహుల్ కి అలవాటుగా మారింది...

ఇక దాంతో వింధ్య చీర కట్టడమే మానేసింది.

ఏదేమైనా ఇక ఈ విషయంలో ఇక తాత్సారం చెయ్యటం కుదరదు... అక్కకి చెప్పేయటమో... బావకి నచ్చినట్లు నడుచుకోవటమో... తొందరగా పెళ్ళి చేసేసుకోవటమో...

ఈ మూడు ప్రత్యామ్నాయాలు మాత్రమే తన ముందున్నాయ్... రెండు రోజుల పాటు ఎడ తెరిపి లేకుండా సాగిన మానసిక సంఘర్షణలో నుండి, ఓ పరిష్కారం తళుక్కుమని మెరవటంతో ఆ రాత్రి ఆనందంగా నిద్రపోయింది.

****

హాలులో టీవీ చూస్తున్న తనని, లాఘవంగా సరాసరి తన గదిలోనికి లాక్కుపోయిన వింధ్యను చూసి ఒకింత ఆశ్చర్యపోయాడు రాహుల్.

తలుపులు మూసేయడంతో... రాహుల్ తలపులు కూడా మారిపోయాయి.

"ఈ ఒక్కసారికే... మరి! ఇదే తొలిసారి... ఇదే ఆఖరు సారి..! బావా... మరలా నానుండి ఇలాంటిది ఆశించకూడదు... నువ్వు."

మురిపెంగా ఆ మాటలు చెవిలో పడగానే... రాహుల్ కి శరీరమంతా సన్నగా తన్మయత్వంతో వణికింది...

స్థాన భ్రంశమైన చున్నీ... ఆమె ఎద సంపదను తేట తెల్లం చేస్తూనే ఉంది...

పై పెదవి మీదున్న 'పుట్టుమచ్చ'ను చూడగానే రాహుల్ లో కోరిక కోడెనాగులా బుసలు కొట్టింది...

రతీ మన్మధులై చెలరేగిన తరువాత... ఆమెను మురిపెంగా హత్తుకుంటూ... "మరలా ఇంకొక్కసారి" అన్నాడు రాహుల్.

ఆమె అతని వేపు కోపంగా చూసింది.

రాహుల్ కి భయమేసింది... మరుక్షణమే అనుమానం కూడా కలిగింది...

"వింధ్యా... నువ్వేనా..." అడిగాడు, ఆదుర్దాగా. రంగుతో అద్దిన, తన పెదవి పై నున్న పుట్టుమచ్చను తుడిచేసుకుంటూ..

"ఏం క్రొత్త అనుభవం దొరికిందిప్పుడు? పెళ్ళి చేస్కున్న భార్యను నేనుండగా, నీకు నా చెల్లెలు కూడా కావాల్సి వచ్చిందా... అన్నలా పెళ్ళి చేయాల్సిన మీరే... కాటేయబోయారంటే ఇక అది ఎవరిని నమ్ముకోవాలి?

కనీసం రూప లావణ్యాలలో కూడా మేమిద్దరమూ వేరు వేరు కాదే! కవలలమైన మేమిద్దరమూ ఒకరికి మరొకరు ప్రతిరూపమే కదా...

ఇప్పటికైనా మీ మగబుద్ధిని మార్చుకుని... మర్యాదగా మసలుకోవడం నేర్చుకోండి..."

ఉగ్ర నరసింహావతారమెత్తిన సంధ్య కళ్ళల్లోకి సూటిగా చూడలేక... తలదించేసుకున్నాడు సిగ్గుతో రాహుల్...

***


పరశురాముడూ పల్లెడాక్టరూ...
ఆదూరి హైమవతి
www.gotelugu.com www.gotelugu.com www.gotelugu.com